RNI NO: APTEL/25/A0108

# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 145, | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజీలు : 8, | వెల రూ. 2 | మంగళవారం -25 - ఆగష్టు - 2026

published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



## 3 లక్షల మంది రష్యా కొత్త సైనికులు.. యుద్ధంలో రష్యా భారీ సన్నాహాలు: జెలెన్‌స్కీ

రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న ఉక్రెయిన్ - రష్యా యుద్ధం

తమపై విరుచుకుపడేందుకు రష్యా సన్నాహాలు చేస్తోందని ఆరోపణ

ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోందని విమర్శ

2లో

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్.. 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు



2లో

- పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌పై జేయూఐఎఫ్ నేత ఫజ్లుర్ రెహ్మాన్ ఆగ్రహం
- 1971 యుద్ధ ఓటమిని ప్రస్తావిస్తూ ప్రస్తుత పరిస్థితులపై హెచ్చరిక
- నిరంతర అణచివేత కొత్త భౌగోళిక సరిహద్దులకు దారితీస్తుందని వ్యాఖ్య
- ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే సైన్యం సంబరాలు చేసుకోవడం సరికాదన్న మౌలానా

# 2027 సంక్రాంతి నుంచి ‘అన్నపూర్ణి సూపర్ సిక్స్’ అమలు

విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

ఏడాదికి 3 ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్న తమిళనాడు ప్రభుత్వం

రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు పథకం వర్తింపు

మహిళలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించిన విజయ్



తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు మిగతా 2 లో



2లో

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి

పార్టీ పేరు, జెండా, విధివిధానాలపై క్లారిటీ ఇచ్చిన విజయసాయిరెడ్డి

విజయవాడ వేదికగా పూర్తి వివరాలను వెల్లడిస్తానన్న విజయసాయి

ప్రజల గొంతుక వినిపించేందుకు ప్రతిపక్ష హోదా అక్కర్లేదని వ్యాఖ్య

## రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి..

# గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

### సీడ్ ను ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు

- ★ దేశంలో తొలి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన గోర్మే సంస్థ
- ★ 11 ఏళ్లలో 69% మార్కెట్ వాటాతో గోర్మే అద్భుత విజయం సాధించిందన్న సీఎం
- ★ రైతులను పారిశ్రామికవేత్తలుగా చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం
- ★ ఫుడ్ ప్రాసెసింగ్‌పై యువత దృష్టి పెట్టాలని చంద్రబాబు పిలుపు
- ★ చింతలపూడి పథకం పూర్తి చేసి నూజివీడు రూపురేఖలు మారుస్తామని హామీ




అమరావతి: వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా ఒక ఆర్థిక శక్తిగా చూడాలని, రైతులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలోనే మొట్టమొదటి నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని అభివృద్ధి చేసిన ‘గౌర్మే పాప్‌కార్నికా’ సంస్థ ఒక వినూత్న విప్లవానికి శ్రీకారం చుట్టిందని ఆయన కొనియాడారు. మిగతా 2 లో

## చంద్రబాబు నిజమైన జాతీయవాది..

# అభివృద్ధిని ఆటంకపరచరు

### రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్

- ఉపరాష్ట్రపతి ప్రశంసలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు
- రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు
- ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ విత్తన రకాన్ని ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి
- ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. మిగతా 2 లో



2లో

## కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలన్న పవన్ కల్యాణ్

కాకినాడ బీచ్‌లో సముద్ర స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతు

ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ

ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మరో ఇద్దరు యువకులు

## 22ఏ బాధితులకు న్యాయం చేసి తీరుతాం..

### భయపడాల్సిన అవసరం లేదు వాళ్లకు డబ్బులు వాపస్

- అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంది
- ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది
- క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం




హైదరాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. 22ఏ బాధితులకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో న్యాయం చేసి తీరుతుందన్నారు. హైదరాబాద్‌లో (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు మిగతా 2 లో

# ‘నా అమెరికా పర్యటన రద్దు.. తెలంగాణ ప్రజలకే అవమానం’

### విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరైనది కాదు

- ‘వికసిత్ భారత్’ ప్రణాళికలో భాగంగానే మేము ‘తెలంగాణ రైజింగ్ 2047’ను ప్రకటించాం
- విద్యా, క్రీడా రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటనను తలపెట్టాం
- నా పర్యటనను అడ్డుకోవడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్ని అవమానించడమే



హైదరాబాద్: గుజరాత్ ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం.. నా పర్యటనకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై ఆయన సోమవారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా నా విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం మిగతా 2 లో

## రేవంత్‌తో భట్టి అత్యవసర భేటీ.. కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ?

- రేవంత్‌రెడ్డితో భట్టి విక్రమార్క అత్యవసర భేటీ
- కొండా సురేఖ వ్యాఖ్యలపై ప్రధానంగా చర్చ
- వివాదాల ప్రభావంపై నేతల సమీక్ష
- తదుపరి చర్యలపై సమాలోచనలు
- పాలన, శాఖల పనితీరుపైనా చర్చ



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిగతా 2 లో




2లో

## కాంగ్రెస్‌కు కొండా ఫ్యామిలీ షాక్?.. జనసేన గూటికి సుస్మిత?

జనసేనలో చేరనున్నట్టు కొండా సుస్మితపై ప్రచారం

కాంగ్రెస్ అధిష్ఠానంపై అసంతృప్తితో ఉన్న సుస్మిత

పరకాల టిక్కెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ అని ప్రకటన

తెలంగాణలో విస్తరణపై జనసేన దృష్టి.. చర్చలు నిజమేనా?

RNI : APTEL/25/A0168
www.mahinewsindia.com
మహా న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



# రైతులే పారిశ్రామికవేత్తలు కావాలి.. గౌర్మే పాప్‌కార్న్ ఒక విప్లవం

మొదటి పేజి తరువాయి

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో కలిసి నూజివీడు సమీపంలోని ముసునూరులో జరిగిన గౌర్మే సంస్థ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, కొత్తరకం పాప్ కార్న్ సీడ్ ను ఆవిష్కరించారు. సంస్థ విజయగాథను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళతామని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఒకప్పుడు మన దేశంలో అమ్ముడైన ప్రతి పాప్‌కార్న్ గింజపై మనం ఖర్చు చేసిన డబ్బులో 70 శాతానికి పైగా బ్రెజిల్, అర్జెంటీనా వంటి దేశాలకు వెళ్లేది. కానీ, గౌర్మే సంస్థ కృషితో ఇప్పుడు ఆ 70 శాతం ఆదాయం మన దేశ రైతులకే దక్కుతోంది. కేవలం 11 ఏళ్లలో ఈ సంస్థ దేశానికి 125 మిలియన్ అమెరికన్ డాలర్ల (దాదాపు రూ.1000 కోట్లకు పైగా) విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసింది. ఇది మనందరికీ గర్వకారణం" అని ప్రశంసించారు. 2014లో ప్రారంభమైన ఈ సంస్థ, నేడు ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రంగా ఎదగడం, 8 రాష్ట్రాల్లో 17,500 మంది రైతులతో 40,000 ఎకరాల్లో సాగు చేస్తూ దేశంలోని 3,400 సినిమా థియేటర్లకు పాప్‌కార్న్‌ను సరఫరా చేయడం అసాధారణ విజయమని కొనియాడారు. సంస్థ ఎండీ పట్టాభిరామారావు గారి కుటుంబానికి వ్యాపార దక్షత, రైతులను ఆదుకునే వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. వ్యవసాయ రంగంలో విలువ జోడింపు (ఖుశ్రీబవాూౄఅఇళఱశఅ) ప్రాధాన్యతను వివరిస్తూ, "ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా, అరటి, మామిడి, మిరప, పసుపు, పామాయిల్ వంటి ఎన్నో వాణిజ్య పంటలు పండుతున్నాయి. అయితే,




వాటిని ప్రాసెస్ చేసి, బ్రాండ్ సృష్టించి అంతర్జాతీయ మార్కెట్‌కు తీసుకెళ్లినప్పుడే రైతు రాజుగా ఎదుగుతాడు. గౌర్మే సంస్థ పొలం నుంచి వినియోగదారుడి వరకు ట్రేసబిలిటీతో ఒక పక్కా వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇదే మోడల్‌ను రాష్ట్రంలోని ఇతర పంటలకు కూడా వర్తింపజేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

ప్రస్తుతం రాష్ట్రం నుంచి ఎగుమతి అవుతున్న ఆక్వా ఉత్పత్తుల్లో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెస్ అవుతోందని, దీనిని 60-70 శాతానికి పెంచగలిగితే ఉపాధి అవకాశాలు, విదేశీ మారక ద్రవ్యం భారీగా పెరుగుతాయని విశ్లేషించారు. రాష్ట్రంలో నీటి భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. "ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో 52 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. అయినప్పటికీ, గతంలో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి రైతులను కొంతవరకు ఆదుకోగలిగాం. నూజివీడు ప్రాంత భవిష్యత్తును మార్చే చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును న్యాయపరమైన అడ్డంకులు తొలగించి త్వరలోనే పూర్తి చేస్తాం. దశాబ్దాల కల అయిన వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ఈ ఆగస్టు 31న జాతికి అంకితం చేస్తున్నాం. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నీటిని అందిస్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. దేశంలోని నదుల అనుసంధానం ఆవశ్యకతను నొక్కిచెబుతూ, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఈ ఆశయానికి మద్దతునివ్వడం అభినందనీయమన్నారు. "గోదావరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, కావేరి నదులను అనుసంధానిస్తే నాలుగు దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. ఇదే స్ఫూర్తితో గంగ-బ్రహ్మపుత్ర నదుల నీటిని కూడా సద్వినియోగం చేసుకోగలిగితే దేశ భవిష్యత్తు అప్రతిహతంగా ముందుకు సాగుతుంది" అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, పది మందికి ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. టెక్నాలజీని వ్యవసాయంతో అనుసంధానించి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి వస్తే ఆకాశమే హద్దుగా రాణించవచ్చని సూచించారు. గౌర్మే సంస్థ చూపిన 'అవుట్ ఆఫ్ బాక్స్' ఆలోచనా విధానం రాష్ట్రంలోని యువతకు స్ఫూర్తిదాయకమని, ఇలాంటి వినూత్న స్టార్టప్‌లకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

## 3 లక్షల మంది రష్యా కొత్త సైనికులు.. యుద్ధంలో రష్యా భారీ సన్నాహాలు: జెలెన్‌స్కీ

ఢిల్లీ: ఉక్రెయిన్-రష్యా మధ్య పోరు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమపై విరుచుకుపడేందుకు రష్యా పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని, అందులో భాగంగా కొత్తగా దాదాపు 3 లక్షల మంది సైనికులను సమీకరించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోందని ఆయన ఆరోపించారు. డొనెట్స్క్ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా మాస్కో అడుగులు వేస్తోందని జెలెన్‌స్కీ తెలిపారు. సెప్టెంబరులో రష్యా పార్లమెంటరీ ఎన్నికలు ముగిసిన అనంతరం ఈ కొత్త బలగాల సమీకరణ ప్రక్రియ ఊపందుకుంటుందని అన్నారు. ఈ ఏడాది ఆరంభం నుంచి రష్యా పెద్ద సంఖ్యలో సైనికులను కోల్పోయినప్పటికీ, తన ఆయుధ సంపత్తిని భారీగా పెంచుకుంటోందని చెప్పారు. రష్యా ప్రస్తుతం ఏటా సుమారు 1,300 బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసే స్థాయికి చేరుకుందని ఆరోపించారు. యుద్ధానికి ముగింపు పలికే దిశగా వచ్చే వేసవి కాలం నాటికి శాంతి చర్చలు జరిగే అవకాశం ఉండవచ్చని జెలెన్‌స్కీ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పాక్ ఆర్మీ చీఫ్‌పై మౌలానా ఫైర్.. 1971 ఓటమిని గుర్తుచేస్తూ తీవ్ర విమర్శలు

ఢిల్లీ: పాకిస్థాన్ సైన్యంపై ఆ దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) చీఫ్ మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్, ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌పై ఘాటు విమర్శలు గుప్పించారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్ ఎదుర్కొన్న పరాభవాన్ని గుర్తుచేస్తూ, సైన్యం తీరును ఆయన తూర్పారబట్టారు. పెషావర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఫజ్లుర్ రెహ్మాన్ మాట్లాడుతూ, దేశంలో నిరంతర అణచివేత, రక్తపాతం కొనసాగితే నూతన భౌగోళిక సరిహద్దులు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సామాన్య ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే, సైన్యం ప్రగల్భాలు పలకడం ఎంతమాత్రం సరికాదని ఆయన మండిపడ్డారు. 1971 యుద్ధానికి ముందు నాటి ఆర్మీ చీఫ్ యాహ్యా ఖాన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. "మేము శత్రువులతో పర్వతాల్లో, ఎడారుల్లో, వీధుల్లో పోరాడతాం. మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరు" అని యాహ్యా ఖాన్ నాడు అన్నారని, కానీ చివరకు పాకిస్థాన్ సైన్యం ఘోర పరాజయాన్ని మూటగట్టుకుందని రెహ్మాన్ ఎద్దేవా చేశారు. భారత్‌తో కేవలం 13 రోజుల పాటు జరిగిన ఆ యుద్ధం ఫలితంగానే బంగ్లాదేశ్ ఆవిర్భవించిందని, 1971 డిసెంబర్ 16న సుమారు 93,000 మంది పాకిస్థాన్ సైనికులు భారత దళాల ఎదుట లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. నాటి పరిస్థితులకు, నేటికీ పెద్దగా వ్యత్యాసం లేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే సైన్యం సంబరాలు చేసుకోవడం భావ్యం కాదని ఫజ్లుర్ రెహ్మాన్ అభిప్రాయపడ్డారు.

## శ్రావణమాసం మూడో శుక్రవారం కొత్త పార్టీని ప్రకటిస్తా: విజయసాయిరెడ్డి

అమరావతి: తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్టు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన ఈరోజు మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం నాడు తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు మరియు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరపున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## కాకినాడ బీచ్‌లో యువకుల గల్లంతు.. గాలింపు ముమ్మరం చేయాలన్న పవన్ కల్యాణ్

అమరావతి: తూర్పు గోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని సముద్ర తీరంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా సముద్ర స్నానానికి వెళ్లిన నలుగురు యువకుల్లో ఇద్దరు భారీ అలల ఉధృతికి గల్లంతయ్యారు. మరో ఇద్దరు ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డారు. గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆయన జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలను తక్షణమే ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలతో పాటు మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్, స్థానిక మత్స్యకారుల సహాయాన్ని కూడా తీసుకోవాలని సూచించారు.

అసలేం జరిగిందంటే.. కాకినాడ గ్రామీణ మండలం సూర్యారావుపేట పరిధిలోని ఎన్టీఆర్ బీచ్ వద్ద ఆదివారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. చీడిగ గ్రామానికి చెందిన కవల సోదరులు అనసూరి వీరబాబు, శ్రీగణేశ్ సాయిరామ్.. తమ స్నేహితులైన పడాల యువకిశోర్ (ఇంద్రపాలెం), కాదా ఆదిత్య వెంకట సందీప్ కుమార్‌తో కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. వీరంతా స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన పెద్ద కెరటం వీరబాబు, యువకిశోర్‌ను సముద్రంలోకి లాక్కెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన బీటెక్ విద్యార్థి శ్రీగణేశ్ సాయిరామ్, మరో ఇంటర్ విద్యార్థి సందీప్ కుమార్ సురక్షితంగా బయటపడ్డారు. వారిని స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారిలో ఒకరు కవల సోదరుడు కావడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం పోలీసులు, సహాయక బృందాలు సముద్రంలో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బాధితుల కుటుంబాలకు అందుబాటులో ఉండి, వారికి ధైర్యం చెప్పాలని, సహాయక చర్యల వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## కాంగ్రెస్‌కు కొండా ఫ్యామిలీ షాక్?.. జనసేన గూటికి సుస్మిత?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర ప్రచారం ఒకటి ఊపందుకుంది. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ వార్తలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత వివాదాల నేపథ్యంలో ఆమె ఈ నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారని, జనసేన నేతలతో చర్చలు కూడా జరుగుతున్నాయని రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో కొండా ఫ్యామిలీకి, కాంగ్రెస్ అధిష్ఠానానికి మధ్య దూరం పెరిగిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పరకాల అసెంబ్లీ టికెట్‌ను ఆశిస్తున్న సుస్మిత, తనకు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించారు. అంతేకాకుండా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆమె పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు సమాచారం. ఇలాంటి తరుణంలోనే సుస్మిత జనసేన వైపు చూస్తున్నారని, ఆ పార్టీ నేతలతో మంతనాలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో పార్టీని విస్తరించే పనిలో ఉన్న జనసేన, ఆమె చేరికకు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం ఆ పార్టీ విస్తరణ వ్యూహాలకు బలం చేకూరుస్తోంది. అయితే, ఈ ప్రచారంపై కొండా సుస్మిత వైపు నుంచి గానీ, జనసేన పార్టీ నుంచి గానీ ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం ముదురుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ ప్రచారం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని రేపుతోంది.

## చంద్రబాబు నిజమైన జాతీయవాది.. అభివృద్ధిని ఆటంకపరచరు: ఉపరాష్ట్రపతి ప్రశంసలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు. ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఒ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు. ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## 'నా అమెరికా పర్యటన రద్దు.. తెలంగాణ ప్రజలకే అవమానం'

మొదటి పేజి తరువాయి

నా విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడం సరైనది కాదు. ఈ వైఖరిని అందరూ తప్పుబడుతున్నారు. 'వికసిత్ భారత్' ప్రణాళికలో భాగంగానే మేము 'తెలంగాణ రైజింగ్ 2047'ను ప్రకటించాం. ముఖ్యంగా విద్యా, క్రీడా రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటనను తలపెట్టాం. లండన్ పర్యటనకు అనుమతి ఇచ్చిన కేంద్రం, అమెరికా వెళ్లేందుకు మాత్రం నిరాకరించింది. అమెరికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించలేదనే కారణంతోనే కేంద్రం అనుమతి నిరాకరించిందంటూ బీజేపీ నేతలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. కొందరు బీజేపీ నేతలు కావాలనే కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు. నేను లండన్, అమెరికా పర్యటనల పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వానికి ముందుగానే అందించా. కేంద్రం కేవలం రాజకీయ కారణాలతోనే నా అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించింది. నా పర్యటనను అడ్డుకోవడం అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్ని అవమానించడమే. కేంద్రం నిర్ణయాన్ని తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలి. ఇది నాకు జరిగిన అవమానం కాదు.. తెలంగాణ జరిగిన అవమానం. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపిస్తోంది. ఈ వివక్షను సహించేది లేదు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తాం. తెలంగాణ బీజేపీ ఎంపీలకు అభివృద్ధి అవసరం లేదా?. కేంద్రం తీరు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఒక రాష్ట్ర సీఎం పర్యటనను అడ్డుకోవడం ఆషామాషీ కాదు. నా పర్యటనను అడ్డుకోవచ్చు. కానీ ఆలోచనను కాదు. సీఎం పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. విదేశాల్లో ఉండి మాట్లాడితే దేశ ద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నా' అని వ్యాఖ్యానించారు.

## రేవంత్‌తో భట్టి అత్యవసర భేటీ.. కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ?

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అత్యవసరంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలతో పాటు మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కొన్ని రోజులుగా వివాదాస్పద అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ వ్యవహారాలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠపై చూపుతున్న ప్రభావంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ అంశంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎలా ముగింపు పలకాలి? పార్టీపై ప్రభావం పడకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలనాపరమైన అంశాలు, వివిధ శాఖల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భేటీకి ప్రాధాన్యం ఏర్పడటంతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సమావేశం తర్వాత ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## 2027 సంక్రాంతి నుంచి 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' అమలు

తమిళనాడు: తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. 'అన్నపూర్ణి సూపర్ సిక్స్' పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. 'వెట్రి పయనం' పేరుతో అక్టోబర్ 2 నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది. ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత మీనంబాక్కం, చెన్నై విమానాశ్రయంలోని కొత్త టెర్మినల్-5 నిర్మించనున్నట్లు కూడా ప్రకటించారు.

## 22ఏ బాధితులకు న్యాయం చేసి తీరుతాం..

హైదరాబాద్: ప్రస్తుతం హైదరాబాద్ కోర్‌లో 22ఏ అంశం ఎంతో జఠిలంగా మారిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ అన్నారు. 22ఏ బాధితులకు ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో న్యాయం చేసి తీరుతుందన్నారు. హైదరాబాద్‌లో (సోమవారం) ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అబద్ధాలతో ప్రతిపక్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని.. ఈ అంశంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని మంత్రి తేల్చిచెప్పారు. మంత్రి మాట్లాడుతూ.. ప్లాట్ల బుకింగ్ కోసం డబ్బులు చెల్లించిన వారికి నగదు వెనక్కి ఇస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు పనిచేయడం లేదని బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇప్పటివరకూ ఆ నంబర్‌కు వేలాదిగా కాల్స్ వచ్చాయి. క్యూర్ ప్రాంతంలోని రైతుల సమస్యలను చర్చించాం. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఫాస్ట్ ట్రాక్‌లో రిజిస్ట్రేషన్లు చేస్తాం. అని మంత్రి అన్నారు.

### సెక్షన్ 22ఏ సమస్య ఏంటి?

రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. అయితే ఇటీవల ప్రభుత్వం తీసుకవచ్చిన 'భూ భారతి'లో 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.

### భయపడాల్సిన అవసరం లేదు వాళ్లకు డబ్బులు వాపస్

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది.

## ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుంది

హైదరాబాద్: అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. బ్రిటన్ పర్యటనకు అనుమతించారని, కానీ అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్‌తో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. తన పర్యటనలో ఎలాంటి దాపరికం లేదని స్పష్టం చేశారు. ఏదైనా దాపరికం ఉందని విదేశాంగ శాఖ భావిస్తే అందుకు కారణాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విదేశాల్లో ఉన్నప్పుడే ఈ అంశంపై స్పందిస్తే తనను దేశద్రోహి అంటారని రేవంత్ అన్నారు. అందుకే భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత స్పందిస్తున్నానని చెప్పారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడమే తన పర్యటన ఉద్దేశమని తెలిపారు. అమెరికా పర్యటనకు తాను వెళ్లలేకపోయినా రాష్ట్ర అధికారులు అక్కడికి వెళ్లారని రేవంత్ చెప్పారు. పెట్టుబడులు, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాల విషయంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకోబోతున్నామని తెలిపారు. గుజరాత్ సీఎంకు విదేశీ పర్యటనలకు అనుమతులు ఇస్తున్నారని రేవంత్ అన్నారు. తెలంగాణ సీఎంకు మాత్రం ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇది వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. గుజరాత్ గుత్తాధిపత్యానికి ఇదే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడాన్ని అడ్డుకోవడమే కేంద్రం నిర్ణయం ఉద్దేశమని రేవంత్ విమర్శించారు. తెలంగాణ బీజేపీ ఎంపీలు గుజరాత్‌కు మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీ ఎంపీలకు అవసరం లేదా అని నిలదీశారు.

## నాడు తిరుమలను కాపాడుకున్నాం, ఇప్పుడు శబరిమల కోసం పోరాడదాం: పీవీఎన్ మాధవ్

అమరావతి: హిందూ ధర్మం, దేవాలయ వ్యవస్థలను నాశనం చేసేందుకు పెద్ద కుట్ర జరుగుతోందని, శబరిమల పవిత్రతను కాపాడటానికి అయ్యప్ప భక్తులు, హిందూ సమాజం నడుం బిగించాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, నాస్తికులు, కొందరు అన్యమతస్థులు హిందూ ధర్మంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. గతంలో తిరుమలలో ఏడుకొండలను రెండు కొండలుగా మార్చేందుకు, ఆచారాలను మార్చేందుకు ప్రయత్నాలు జరిగాయని గుర్తు చేశారు. అప్పుడు హిందూ సమాజం పోరాడి తిరుమల పవిత్రతను కాపాడుకుందని, అదే స్ఫూర్తితో ఇప్పుడు శబరిమల రక్షణకు కూడా పోరాడాలన్నారు. "స్వామియే శరణమయ్యప్ప అంటూనే, ధర్మాన్ని నాశనం చేసే శక్తుల పీచమణిచేందుకు కూడా సిద్ధం కావాలి" అని ఆయన ఉద్బోధించారు. ఈ సమావేశంలో పాల్గొన్న టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కేరళలోని ప్రభుత్వం మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. గతంలో టీటీడీ నిధులపై జరిగిన చర్చను ప్రస్తావిస్తూ, "వెంకటేశ్వర స్వామి వడ్డీ కాసుల వాడే కానీ, వడ్డీ వ్యాపారి కాదు" అని తాను అధికారులకు స్పష్టం చేసినట్లు తెలిపారు. టీటీడీ చట్టం ప్రకారం ఇతర దేవాలయాల్లో అన్నప్రసాదం అందించేందుకు అవకాశం ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేలా మాధవ్‌తో చర్చిస్తామన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో భక్తులు లేవనెత్తిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఇది కేవలం అయ్యప్ప భక్తుల సమస్య కాదని, యావత్ హిందువుల సమస్యగా భావించి పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

## ఏలూరులో ఉపరాష్ట్రపతితో కలిసి కొత్తరకం పాప్‌కార్న్ సీడ్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగంలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లా, ముసునూరు మండలంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా కీలక ఆవిష్కరణ చేశారు. దేశంలోనే తొలిసారిగా అభివృద్ధి చేసిన నాన్-జీఎంవో (జన్యుపరమైన మార్పులు లేని) పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని వారు లాంఛనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు విచ్చేసిన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు ముసునూరు మండలం కాత్రేనిపాడు వద్ద ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌లు ఉపరాష్ట్రపతిని సాదరంగా ఆహ్వానించి వేదిక వద్దకు తోడ్కొని వెళ్లారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేశారు. 'గోర్మే పాప్‌కార్న్‌కా' సంస్థ ఆధ్వర్యంలో ఈ నూతన హైబ్రిడ్ వంగడాన్ని అభివృద్ధి చేశారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్, ఆసియా ఖండంలోనే అతిపెద్ద ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందడం విశేషం. ఈ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా వేలాది మంది రైతులతో ఒప్పందాలు కుదుర్చుకుని, వేల ఎకరాల్లో పాప్‌కార్న్ సాగును ప్రోత్సహిస్తోంది. దేశంలోని అనేక మల్టీప్లెక్స్‌లు, సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సందర్భంగా, వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పునరుద్ఘాటించారు. నాన్-జీఎంవో వంటి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఏపీ రైతులకు మంచి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నూతన ఆవిష్కరణ స్థానిక రైతులకు గొప్ప వరం కానుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## 19 ఏళ్ల కేరళ యువతి సంచలనం.. మిస్ యూనివర్స్ ఇండియా 2026 కిరీటం



ఢిల్లీ: కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటం దక్కించుకుంది. జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె విజేతగా నిలిచింది. దేశవ్యాప్తంగా పోటీపడిన 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి టైటిల్ సొంతం చేసుకుంది. మిస్ యూనివర్స్ ఇండియా 2025 విజేత మానికా విశ్వకర్మ ఆమెకు కిరీటం అలంకరించారు. దీంతో నవంబర్‌లో ప్యూర్టోరికోలో జరిగే 75వ మిస్ యూనివర్స్ పోటీలో భారత్ తరఫున కజియా ప్రాతినిధ్యం వహించనుంది. కిరీటం దక్కిన అనంతరం కజియా ఆనందం వ్యక్తం చేసింది. ఈ కిరీటం కోసం మూడేళ్లకు పైగా కష్టపడ్డానని తెలిపింది. తన సొంత రాష్ట్రం కేరళకు ఈ విజయాన్ని తీసుకెళ్లడం ఎంతో గర్వంగా ఉందని చెప్పింది. 19 ఏళ్ల వయసులో ఇంత పెద్ద వేదికపై నిలవడానికి ఎంతో ధైర్యం అవసరమైందని కజియా పేర్కొంది. తనపై తనకు నమ్మకం పెంచుకోవడం అతిపెద్ద సవాలుగా భావించానని తెలిపింది. భారత్‌కు మిస్ యూనివర్స్ కిరీటం తీసుకురావడమే తన తొలి లక్ష్యమని కజియా చెప్పింది. తాను చేసే ప్రతి పనిలో భారత్, కేరళకు ప్రాతినిధ్యం వహించాలనుకుంటున్నట్లు తెలిపింది. విజేతను ఎంపిక చేసిన జడ్జింగ్ ప్యానెల్‌లో మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్, ఉర్వశి రౌతేలా, రియా సింఘా, పర్యావరణవేత్త ప్రగ్యా కపూర్ ఉన్నారు. సెలీనా జైట్లీ కూడా జడ్జిగా వ్యవహరించారు. వైష్ణవి గణేశ్ తొలి రన్నరప్‌గా నిలిచింది. ఆమెకు మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ దక్కింది. అనుశ్రీ సాతవ్లేకర్ రెండో రన్నరప్‌గా నిలిచింది. తేజస్విని శ్రీవాస్తవ మూడో రన్నరప్, అనుభా వశిష్ఠ్ చౌదరి నాలుగో రన్నరప్‌గా నిలిచారు.

## కొడంగల్ లో బి ఎల్ ఏ లకు అవగాహన సదస్సు

**- పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఎస్ ఐ ఆర్ ఫేస్-II కార్యక్రమంలో భాగంగా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల (బి ఎల్ ఏ) అవగాహన సదస్సు ఈరోజు కొడంగల్ పట్టణంలోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో నిర్వహించారు.టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్, పరిగి ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై బి ఎల్ ఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ ఐ ఆర్ పేస్-IIలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా బి ఎల్ ఏలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఎలాంటి అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ నెల 27న నిర్వహించనున్న గ్రామ సభల్లో బి ఎల్ ఏ లు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గంలో నోటీసుల ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేలా బిఎల్ఏ లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. నోటీసుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే తనను లేదా ఎస్ ఐ ఆర్ కోఆర్డినేటర్ మల్లేశ్ యాదవ్‌ను సంప్రదించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధార సింగ్, స్థానిక మున్సిపల్ చైర్మన్ నందరాం ప్రశాంత్, నారాయణపేట గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్, మండల అధ్యక్షుడు, ఎస్ ఐ ఆర్ కొడంగల్ కోఆర్డినేటర్ మల్లేశ్ యాదవ్, సర్పంచులు, కౌన్సిలర్లు, కొడంగల్ నియోజకవర్గంలోని వివిధ బూత్‌లకు చెందిన బి ఎల్ ఏ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**-పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**

**పూడూరు మండల పరిధిలోని మంచన్పల్లి, పెద్ద ఉమెన్ తాల్, కంకల్ గ్రామాలలో పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి స్మార్ట్ కార్డులు పంపించేశారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. పూడూరు మండల పరిధిలోని మంచన్పల్లి కంకల్ ఉమ్మంతాళ్ గ్రామాలలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి వారి ఇంటికి చేరేలా మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు పనిచేయాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందుకు సంబంధించిన వివరాలను





ప్రజలందరికీ వివరించవలసిన అవసరం ఉందని కూడా పేర్కొన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వివరించాలని అన్నారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం గురించి ఆయా గ్రామాలలోని స్థానిక నాయకులు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు సురేంద్ర ముదిరాజ్, ఆత్మ కమిటీ చైర్మన్ కక్కునూరు శ్రీనివాస్ రెడ్డి, పూడూరు మండల పిఎసిఎస్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి, భాస్కర్, రాకంచెర్ల సర్పంచ్ కమ్లి బాయ్ పెంటయ్య పాల్గొన్నారు.

## చౌడాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ!



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: చౌడాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి చౌడాపూర్ మండల కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ కమిటీలో ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, స్పోక్స్‌పర్సన్, గౌరవ అధ్యక్షులు, మీడియా ఇన్‌చార్జ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎంపిక చేయడం జరిగింది. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది.

### నేడు చౌడపూర్ మండల్ లో ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పర్యటన



**-మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్**

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): చౌడాపూర్ మండల కేంద్రానికి మన ప్రియతమ నాయకులు, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి 25వ తేదీ మంగళవారం విచ్చేయనున్నారు. మండలంలో ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో, సర్పంచులతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వం ద్వారా అర్హత పొందిన లబ్ధిదారులకు స్మార్ట్, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుంది. కావున చౌడాపూర్ మండల ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని, అర్హత పొందిన ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. అందరూ తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు.

## లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు పనులకు భూ సర్వే ప్రారంభం

**పరిగి ఎమ్మార్వో వెంకటేశ్వరి, ఎస్సై మోహనకృష్ణ, ఇరిగేషన్ అధికారులు దగ్గరుండి పనులు ప్రారంభించారు**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): సయ్యద్ పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో పాలమూరు రంగారెడ్డి రెడ్డి ఎత్తి పోతల పథకంలో భాగంగా జరుగుతున్న లక్ష్మి దేవి పల్లి ప్రాజెక్టు పనులకు భూ సర్వే పనులు రెవిన్యూ అధికారులు ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ అధికారులు పోలీస్ శాఖ అధికారులు , పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి, పరిగి సబ్ ఇన్స్పెక్టర్ మోహన కృష్ణ, సయ్యద్ పల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జిల్లాలో భూముల రీ సర్వే పనుల పురోగతిపై.......

# కలెక్టర్ దీపక్ తివారి సమీక్ష !

**భూముల రీ సర్వే పనుల పురోగతిపై మండల తాహసిల్దారులతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సమీక్షా సమావేశం**

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): జిల్లాలో చేపడుతున్న రీ సర్వే పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాల వారీగా రీ సర్వే ప్రక్రియ, భూ రికార్డుల పరిశీలన, సర్వే పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు తమ మండలాల పరిధిలో రీ సర్వే పనుల ప్రస్తుత స్థితిగతులను, పెండింగ్ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. సర్వే ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటిస్తూ భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలు నిర్వహించి రీ సర్వే పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటా చారి, డి ఆర్ ఓ స్వర్ణ లత, ఆర్ డి ఓ వాసు చంద్ర,డిప్యూటీ కలెక్టర్ పూజ ,ఏ డి సర్వే ల్యాండ్ మధుసూదన్,అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**- పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి**

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గతంలో ఎప్పుడు జరగని అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్నాయని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పూడూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (ఎస్ ఐ ఆర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. స్మార్ట్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల



అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులు,ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం,రాష్ట్ర సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే



తెలిపారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నామని అన్నారు. మహిళలు, కుటుంబ సంక్షేమం కోసం మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ కుటుంబ బీమా, కళ్యాణమస్తు, షాదీ ముబారక్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా, పంటల బోనస్, ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. అదేవిధంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, బీసీ మహిళలకు కుట్టు మిషన్లు, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు, ఎస్సీ--ఎస్టీ, మైనారిటీ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పూడూరు మండల పరిధిలో మొత్తం 34 రేషన్ షాపులు, 14,389 బిపిఎల్ కార్డులు ఉన్నట్లు అధికారులు వివరించారు. జూలై నెల వివరాల ప్రకారం ఏ ఎఫ్ ఎస్ సి కార్డులు 1,669, ఎఫ్ ఎస్ సి కార్డులు 12,720 ఉన్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని, నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని గ్రామాల వారీగా సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

### ఈ నెల 27న ప్రతి గ్రామంలో గ్రామ సభలు

ఎస్ ఐ ఆర్ పేస్-2 ప్రక్రియలో భాగంగా ఈ నెల 27వ తేదీన



ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. గ్రామ సభల్లో డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్‌ను ప్రజలకు చదివి వినిపించి, ఓటర్ల వివరాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ సంబంధిత పత్రాలతో ఈ నెల 27న నిర్వహించే గ్రామ సభలకు తప్పనిసరిగా హాజరై తమ వివరాలను పరిశీలించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.అవసరమైన వివరణలు, ఆధారాలను అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వీడియో కాన్ఫరెన్స్...

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 27 వ తేదీన గ్రామ/వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు,ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ/వార్డు సభల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ లో భాగంగా ఈ నెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో గ్రామ/వార్డు సభలు నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితా, ఎ.ఎస్.డి.(ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్) జాబితా బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల



సమక్షంలో చదివి వినిపించాలని తెలిపారు. గ్రామ/వార్డు సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారులు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే నోట్ చేసుకోవాలని తెలిపారు. అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని తెలిపారు. అవసరం ఉన్నచోట అదనపు ఎ.ఈ.ఆర్.ఓ.ల సంబంధిత ప్రతిపాదనలు రేపటి లోగా పంపించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, నోటీసులను సంబంధిత ఓటర్లకు 3 రోజులలోగా అందిస్తామని తెలిపారు. కార్యాచరణ ప్రకారం గ్రామ/వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అదనపు ఎ.ఈ.ఆర్.ఓ ల సంబంధిత ప్రతిపాదనలు పంపించడం జరిగిందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సు లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) వెంకటా చారి,డి ఆర్ ఓ స్వర్ణ లత , ఆర్ డి ఓ వాసు చంద్ర , ఎన్నికల సుపరింటేన్డెంట్ నేమత్ హాలి సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతతో స్పందించి సకాలంలో పరిష్కరించాలి..

**పీజీఆర్ఎస్ కు 324 అర్జీలు..**

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**



కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 24: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా స్పందించి,అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులనుఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్,జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్, డి ఆర్ ఓ డా.తిప్పేనాయక్, లతో పాటు డ్వామా పిడి మధుసూదన్, డిఆర్డీఏ పిడి జి.శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ,వార్డు అధికారి జె.వేణుగోపాల్, డీడీఓ పి.వాసుదేవర రావు, తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

### రెవెన్యూ క్లినిక్ కు -33 అర్జీలు

జిల్లా కలెక్టరేట్ లో జరిగిన రెవిన్యూ క్లినిక్ లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ తిప్పే నాయక్ ప్రజల నుంచి రెవిన్యూ సమస్యల మీద అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం,సమగ్ర మైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధి కారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్) : ప్రజావాణిలోస్వీకరించిన ప్రజా ఫిర్యాదులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలు లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమస్యలకు సంబంధించిన 109 దరఖాస్తులను స్వీకరించారు. పెన్షన్, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు,, సంబందిత శాఖలకు సంబంధించి దరకాస్తు లను స్వీకరించారు. ప్రజల నుండి అందిన వినతులను స్వీకరించి, వాటిని సంబందిత శాఖలకు పంపిస్తూ నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రజల సమస్యలను పెండింగ్ ఉంచకుండా పారదర్శకంగా, వేగవంతంగా పరిష్కరించాలని ప్రతి వినతిని పరిశీలించి



అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని, శాఖ ల వారిగా పెండింగ్ ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి సోమవారము ప్రతి మండలం ఏం పి డి ఓ కార్యాలయంలో ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని, మండలాల లో ఉండే ప్రజలు ప్రతి సోమవారం మండలాల్లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని' మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన తెలిపారు. కార్యక్రమంలో లోకల్ బాడీ అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి ఆర్ ఓ స్వర్ణ లత, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏఈఈ నియామక పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి (ప్రాజెక్ట్స్ - హెచ్ఆర్)



గుంటూరు, మహి న్యూస్, ఆగస్టు 24 : ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ు హెచ్ఆర్) శ్రీ టీవీఎస్ఎన్ మూర్తి వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోని మలినేని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను డైరెక్టర్ పరిశీలించారు.పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అవసరమైన అన్ని



చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ సందర్శనలో సీఆర్డీఏ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చల్లా రమేష్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిబాబు పాల్గొన్నారు.

# వికారాబాద్ డిఎస్పి ఆఫీసులో వార్షిక తనిఖీ:-జిల్లా ఎస్పీ స్నేహామేహారా

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ నేడు వికారాబాద్ డీఎస్పీ కార్యాలయాన్ని సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ముందుగా కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని నిరంతరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కార్యాలయంలోని రికార్డులు, ఫైళ్లు, కేసులకు సంబంధించిన పత్రాలను పరిశీలించి, వికారాబాద్ సబ్-డివిజన్ పరిధిలోని కేసుల స్థితిగతులను సమీక్షించారు. దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ కేసులు, సీడీ ఫైళ్లు, కోర్టు కేసులు, వారెంట్లు, దర్యాప్తు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యతతో పాటు వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని,





శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించాలని, సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తులో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు, అనుమానితులు నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణలో భాగంగా బీట్ పోలీసింగ్, పెట్రోలింగ్ విజిబుల్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నేరాలు జరిగే ప్రాంతాలు, సమయాలు మరియు నేరాల స్వభావాన్ని విశ్లేషించి, అందుకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా దొంగతనాలు, మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వికారాబాద్ పట్టణంలోని ట్రాఫిక్ పరిస్థితిని కూడా ఎస్పీ సమీక్షించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు మరియు ఇతర అధిక ట్రాఫిక్ ఉండే ప్రాంతాలను గుర్తించి, సమర్థవంతమైన ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, “ప్రతి కేసు దర్యాప్తులో నాణ్యత, పారదర్శకత మరియు వేగం చాలా ముఖ్యమైనవి. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి. నేర నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు పిల్లల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజలకు సత్వర మరియు పారదర్శకమైన పోలీస్ సేవలను అందించడమే మన ప్రధాన లక్ష్యం.” అని అన్నారు. అనంతరం ఎస్పీ డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ వార్షిక తనిఖీలో వికారాబాద్ డీఎస్పీ, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, సబ్-డివిజన్ ఎస్ఐలు, సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలపై కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చలు



అమరావతి,మహిన్యూస్,ఆగస్టు 24: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనలకు అనుగుణంగా కూటమి భాగస్వామ్య పక్షాలతో చర్చలు కొనసాగుతున్నాయని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం ఈ చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయని, కూటమి తరఫున అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తున్నట్లు తెలిపింది. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమాచారాన్ని పారదర్శకంగా సమీక్షించిన అనంతరం జనసేన పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల విషయంలో పవన్ కళ్యాణ్ తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. జనసేన పోటీ చేసే స్థానాలు, అభ్యర్థుల పేర్లపై జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ విశ్వసించవద్దని స్పష్టం చేసింది. కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థుల పేర్లతో తీర్మానాలు చేస్తున్న విషయం పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి వచ్చిందని తెలిపింది. పార్టీ విధివిధానాలు, క్రమశిక్షణను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించింది. జన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తి, ఆత్మగౌరవాన్ని నిలబెట్టే విధంగా జనసేన ఎన్నికల బరిలో ఉంటుందని ఇటీవలి పార్టీ శాసనసభా పక్ష సమావేశంలో పవన్ కళ్యాణ్ వెల్లడించిన విషయాన్ని పార్టీ శ్రేణులు గుర్తుంచుకోవాలని కేంద్ర కార్యాలయం సూచించింది.

## టైక్వాండ్ పోటీల్లో మురమళ్ళవిద్యార్థులకు బంగారు పథకాలు



ఐ.పోలవరం మండలం, మహి న్యూస్, ఆగస్టు 24: టైక్వాండ్ కరాటే పోటీల్లో మురమళ్ళకు చెందిన విద్యార్థులకు బంగారు పతకాలు సాధించారు. మురమళ్ళ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, టిడిపి సీనియర్ ప్రముఖుడు ఏలూరు సూర్యనారాయణ మూర్తి కాకినాడ భాష్యం పబ్లిక్ స్కూల్లో పదో తరగతి విద్యను అభ్యసిస్తున్నారు. ఏలూరి శ్రీకృష్ణ లాస్య(అండర్ 70 కేజీల విభాగం), ఏలూరు వెంకట సుబ్బారావు (అండర్ 60 కేజీల విభాగం) లో ప్రతిభ సాధించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన వీరిరువురు బంగారు పథకాలు దక్కించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి టైక్వాండ్ పోటీల్లో శ్రీకృష్ణ లాస్య (అండర్ 70 కేజీలు) క్యాస పతకం, ఏలూరు వెంకట సుబ్బారావు( అండర్ 58 కేజీలు విభాగంలో) రజిత పథకం సంపాదించారు. వీ రు కోచ్ కాకినాడకు చెందిన బి అర్జున్ రావు బ్లాక్ బెల్ట్6 క్లాస్ .1నేషనల్ స్థాయిలో అగ్రగానిగా నిలిచి ఆయన ఆధ్వర్యంలో ఈ ఇరువురు విద్యార్థులు తర్ఫీదు పొందరు. బంగారు పతకాలు సాధించిన కృష్ణ లాస్య, వెంకట సుబ్బారావు ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), ఎమ్మెల్సీ పే రాబత్తుల రాజశేఖర్, కోనసీమ జిల్లా టిడిపి అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాష్ట్ర తెలుగు యువత సీనియర్ ప్రతినిధి దాట్ల పృథ్వీరాజ్, మండల టిడిపి అధ్యక్షులు సాగిరాజు సూరిబాబు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు కాకర్లపూడి రాజేష్, టిడిపి సీనియర్ నాయకులు జంపన భీమరాజు, నడింపల్లి సోమరాజు, కటారి నాని, సీనియర్ జర్నలిస్ట్ కాలే వెంకటరత్నం, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.



## సీతారామస్వామి ఆలయ భూములకు బహిరంగ వేలం



### నెలకు రూ.30 వేల లీజు ఖరారు

తాళ్లరేవు, మహి న్యూస్, ఆగస్టు 24: మండల పరిధిలోని కాపులపాలెంలో వేంచేసియున్న శ్రీ సీతారామస్వామివారి దేవస్థానానికి సంబంధించి యానాం కనకాలపేట గ్రామంలో ఉన్న భూములకు సోమవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ ఉపకమీషనర్ డీఎల్వీ రమేష్ బాబు పర్యవేక్షణలో ఈవో గంటి అశ్విని వేలం పాట నిర్వహించారు. సర్వే నెంబరు 161లో ఉన్న రెండు ప్రతులకుగానూ సుమారు 3 ఎకరాల 72 సెంట్ల ఖాళీ భూమికి లైసెన్స్ హక్కునకు బహిరంగ వేలం పాట నిర్వహించగా నెలకు రూ.30 వేలు చెల్లించేందుకు భూపతిరాజు వెంకట సత్య సాయిరాజు పాట దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో ఏడుగురు పాల్గొనగా రెండవ హెచ్చు పాటదారులు నందికోళ్ల విష్ను ప్రవీణ్ రూ.29 వేల వరకు పాడారు. దీంతో హెచ్చు పాటదారుడు సాయిరాజుకు అధికారులు పాట ఖరారు చేసారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమీషనర్ రమేష్ బాబు చిలేకర్లతో మాట్లాడుతూ దేవస్థానాలకు ఆదాయం పెంచే చర్యల్లో భాగంగా ఖాళీగా, బీడుగా ఉన్న భూములను 11 ఏళ్ల కాలానికి నెలవారీ అద్దె చెల్లించు పద్ధతిన. అప్పగించిన తేదీనుంచి 11 ఏళ్ల కాలానికి లీజుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ విజయవాడ కమీషనర్ వారి ఉత్తర్వులకు లోబడి ఆ భూములను వినియోగించు కోవాలని తెలిపారు. దేవాదాయ శాఖ నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణమే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఖాళీ స్థలంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని, లైసెన్స్ దారులు తాత్కాలిక షెడ్లు మాత్రమే వేసుకోవాలని, నిర్ణీత గడువు అనంతరం యధావిదిగా అప్పగించాలన్నారు. ప్రతీ మూడేళ్లకు 30 శాతం అద్దెను పెంపుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలో డీఈఓ వి. వెంకటేశ్వరరావు. ఇన్స్పెక్టర్ వి.ఫణీంద్ర కుమార్, ఈఓలు బీవీఆర్ చౌదరి, లక్ష్మణ్, కెవివి వేణుగోపాల్, జి. శివబాబు, కెటి రవితేజ, కె.సోమరాజు, కెవిఎస్ కెవి ప్రసాద్, కృష్ణారెడ్డి సిబ్బంది రఘుకుమార్, సూరిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు..

### ముమ్మిడివరంలో హర్షం



ముమ్మిడివరం, మహి న్యూస్, ఆగస్టు 24: బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గానికి చెందిన బీసీ వర్గాలు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో ముమ్మిడివరం టీడీపీ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తుల సాయి, దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీసీలకు రక్షణ చట్టం, 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడంతో పాటు, వారిని రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ, శాసనమండలిలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును ఆమోదించినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవగాహన లోపంతో బీసీలకు 24 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించడంతో సుమారు 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలను కోల్పోయారని వారు పేర్కొన్నారు.ఎన్టీఆర్ హయాం నుంచి తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నుముకగా నిలిచారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకుని బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చక్కెర ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? ఇథనాల్‌కు సంబంధం లేదన్న కేంద్రం

కడప మహిన్యూస్ ఆగష్టు 24.: నెల రోజుల్లో కిలో చక్కెర ధర ?48.18 నుంచి ?55.70కు పెరుగుదల --- తగ్గిన దేశీయ ఉత్పత్తి, పండుగల డిమాండ్, పంట నష్టం, అంతర్జాతీయ సరఫరా కొరత, నిల్వలు పెంచడం ప్రధాన కారణాలని కేంద్రం వెల్లడిదేశంలో చక్కెర ధరలు ఒక్కసారిగా పెరగడం వినియోగదారుల్లో ఆందోళనకు కారణమవుతోంది. నెల రోజుల వ్యవధిలో కిలో చక్కెర ధర ?48.18 నుంచి ?55.70కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ధరలు మరింత పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ధరల పెరుగుదలకు చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడమే కారణమన్న వాదనను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది.ఇథనాల్ ఉత్పత్తికి మళ్లిస్తున్న చక్కెర పరిమాణం వాస్తవానికి తగ్గిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. 2022--23 సీజన్‌లో చక్కెరలో ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన వాటా సుమారు 12 శాతం ఉండగా, 2025--26 సీజన్‌లో అది దాదాపు 9 శాతానికి తగ్గిందని తెలిపింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడు వంతులు ప్రస్తుతం ధాన్యాల నుంచే, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని పేర్కొంది.




### తగ్గిన దేశీయ చక్కెర ఉత్పత్తి

ప్రస్తుత సీజన్‌లో దేశీయ చక్కెర ఉత్పత్తి సుమారు 3.06 కోట్ల టన్నులకు పరిమితం కావచ్చని కేంద్రం అంచనా వేసింది. చెరకు సాగు రాష్ట్రాలు తొలుత అంచనా వేసిన 3.43 కోట్ల టన్నులతో పోలిస్తే ఇది గణనీయమైన తగ్గుదల.ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రధాన చెరకు ఉత్పత్తి రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు పంట దిగుబడిపై ప్రభావం చూపాయి. అధిక వర్షాలు, నీటిముంపు, తెగుళ ,, వ్యాధులు చెరకు పంటను దెబ్బతీశాయి. ముఖ్యంగా రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి వ్యాధులు దిగుబడిని తగ్గించాయని కేంద్రం వెల్లడించింది.పండుగల నేపథ్యంలో పెరిగిన డిమాండ్ఆగస్టు నుంచి నవంబర్ వరకు దేశంలో పండుగల సీజన్ కొనసాగుతుంది. ఈ కాలంలో మిఠాయిలు, బేకరీ ఉత్పత్తులు, ఇతర ఆహార పదార్థాల తయారీలో చక్కెర వినియోగం సాధారణంగా పెరుగుతుంది.పండుగల డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసిన వ్యాపారులు, వాణిజ్య సంస్థలు పెద్ద మొత్తంలో చక్కెరను కొనుగోలు చేసి నిల్వ చేసుకోవడంతో మార్కెట్‌లో తక్షణ డిమాండ్ మరింత పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

### అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సరఫరా ఒత్తిడి

దేశీయ పరిస్థితులతో పాటు అంతర్జాతీయ మార్కెట్ పరిణామాలు కూడా చక్కెర ధరలపై ప్రభావం చూపుతున్నాయి. 2026--27లో ప్రపంచ చక్కెర మార్కెట్‌లో సుమారు 33 లక్షల టన్నుల లోటు ఏర్పడే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది.అంతర్జాతీయ చక్కెర ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. జూన్ 30న టన్నుకు సుమారు వి474గా ఉన్న ధర ఆగస్టు 20 నాటికి వి552కు చేరింది. అంటే దాదాపు 16 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా పరిస్థితులు కఠినతరం కావడం కూడా దేశీయ మార్కెట్‌పై ఒత్తిడి పెంచుతోంది.

### నిల్వలు, ఊహాగానాల ప్రభావం

ధరలు మరింత పెరగవచ్చన్న అంచనాలతో కొంతమంది వ్యాపారులు, డీలర్లు పరిమితికి మించి చక్కెరను నిల్వ చేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. దీనివల్ల కృత్రిమ కొరత ఏర్పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.పండుగల డిమాండ్, ఉత్పత్తి తగ్గుదల నేపథ్యంలో భవిష్యత్‌లో సరఫరా తగ్గవచ్చన్న అంచనాలతో మార్కెట్‌లో ఊహాగానాలు పెరగడం కూడా ధరలపై ప్రభావం చూపుతున్నట్లు కేంద్రం పేర్కొంది.

### ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు

చక్కెర ధరలను అదుపులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. మార్కెట్‌లో సరఫరాను పెంచేందుకు 10 లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది. అదే సమయంలో వ్యాపారులు, డీలర్లు కలిగి ఉండే చక్కెర నిల్వలపై కఠిన పరిమితులను అమలు చేస్తోంది. దీంతో మార్కెట్‌లో కృత్రిమ కొరతను అరికట్టి, వినియోగదారులకు సరఫరా సజావుగా ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ఇథనాల్ కారణం కాదన్న కేంద్రం

చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే ప్రధాన కారణమన్న విమర్శలను కేంద్రం స్పష్టంగా ఖండించింది. చక్కెరను ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించే వాటా గతంతో పోలిస్తే తగ్గిందని, ప్రస్తుతం ధాన్యాల ఆధారిత ఇథనాల్ ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలిపింది. అందువల్ల ప్రస్తుత ధరల పెరుగుదలను ఇథనాల్ విధానంతో నేరుగా ముడిపెట్టడం సరైనది కాదని కేంద్రం స్పష్టం చేసింది.

### ఐదు ప్రధాన కారణాలు

ప్రస్తుతం చక్కెర ధరలు పెరగడానికి ప్రధానంగా ఐదు అంశాలు కారణమని కేంద్రం వివరణను బట్టి తెలుస్తోంది: దేశీయ చక్కెర ఉత్పత్తి తగ్గడం, పండుగల సీజన్‌లో డిమాండ్ పెరగడం. అధిక వర్షాలు, నీటిముంపు, తెగుళ్ల కారణంగా చెరకు పంట దెబ్బతినడం, ప్రపంచ మార్కెట్‌లో చక్కెర సరఫరా తగ్గడం, వ్యాపారుల నిల్వలు, ఊహాగానాల కారణంగా కృత్రిమ కొరత ఏర్పడే అవకాశంచక్కెర ధరల పెరుగుదల వినియోగదారులపై అదనపు భారాన్ని మోపుతున్న నేపథ్యంలో, ఉత్పత్తి-సరఫరా పరిస్థితులను కేంద్రం నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పండుగల సీజన్‌లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, మార్కెట్‌లో తగినంత నిల్వలు అందుబాటులో ఉండేలా చూడటం కీలకం.ప్రస్తుత ధరల పెరుగుదల వెనుక ఇథనాల్ కంటే ఉత్పత్తి తగ్గుదల, పంట నష్టం, పండుగల డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, నిల్వలు మరియు ఊహాగానాల ప్రభావమే ప్రధానమని కేంద్రం స్పష్టం చేసింది.

# క్యాంపస్ నుంచి నిరసన వరకు: యువత గొంతుకగా రాహుల్ గాంధీ

**డా. ముచ్చుకోట సురేష్ బాబు,**

హైదరాబాద్ మహి న్యూస్ ఆగష్టు 24: విద్య, భద్రత, ఉపాధి, గౌరవం, ప్రజాస్వామ్య హక్కులు వంటి అంశాలను భారత యువత ప్రధానంగా ప్రజా చర్చల్లోకి తీసుకొస్తోంది. కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులు, యువతులు, యువతతో సాగిస్తున్న ఇటీవలి సంభాషణలు ఈ మారుతున్న రాజకీయ చర్చకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి.ఆగస్టు 22న పుణెలో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో మహిళా విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించడం, ఆర్థిక స్వావలంబన సాధించడంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను బహిరంగంగా వెల్లడించారు. లైంగిక వేధింపులు, సురక్షితం కాని ప్రజా రవాణా, వ్యక్తిగత భద్రత, విద్య పెరుగుతున్న వ్యయం వంటి అంశాలను వారు ప్రస్తావించారు.ఈ సంభాషణ ఒక ముఖ్యమైన వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చింది. విద్య అందుబాటులో ఉండటం అంటే కేవలం కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉండటం మాత్రమే కాదు. యువతులు సురక్షితంగా చదువుకోగలరా, కళాశాలలకు వెళ్లి రావచ్చా, ఉన్నత విద్య ఖర్చులను కుటుంబాలు భరించగలవా అన్న అంశాలు కూడా విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు హాజరు కావడం, దీనికి లభించిన స్పందన యువత రాజకీయ ఆకాంక్షలకు మరోసారి ప్రాధాన్యతను తెచ్చింది. సురక్షితమైన క్యాంపస్‌లు, అందుబాటులో ఉండే విద్య, ఉపాధి అవకాశాలు, వేధింపుల నుంచి విముక్తి, తమ జీవితాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే హక్కు వంటి అంశాలు విద్యార్థుల దృష్టిలో అత్యంత కీలకమైనవిగా మారుతున్నాయి.



### మహిళా స్వేచ్ఛ, ఆర్థిక స్వావలంబన

పూణే లో జరిగిన సంభాషణ సందర్భంగా రాహుల్ గాంధీ మహిళల స్వయం నిర్ణయాధికారాన్ని ప్రస్తావిస్తూ, పితృస్వామ్య సామాజిక నిర్మాణాల పరిమితులకు లోబడకుండా మహిళలు తమ జీవితాలపై తామే నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని అన్నారు. భారతదేశ మహిళలు దేశానికి గొప్ప బలమని పేర్కొంటూ, యువతులు తమపై తాము నమ్మకం పెంచుకుని హక్కుల కోసం నిలబడాలని పిలుపునిచ్చారు. అయితే విద్యార్థులు లేవనెత్తిన సమస్యలు కేవలం రాజకీయ ప్రసంగాల పరిధిలోకి వచ్చే అంశాలు కావు. లైంగిక వేధింపులు, తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, ఆర్థిక పరిమితులు యువతులు తమ విద్యను కొనసాగించాలా, ఉద్యోగాల్లోకి ప్రవేశించాలా, ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలా అన్న విషయాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి.అందువల్ల మహిళల భద్రత కేవలం సామాజిక సమస్య మాత్రమే కాదు; అది విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన అంశం కూడా.ఒక యువతి కళాశాలకు సురక్షితంగా వెళ్లలేకపోతే, ఉన్నత విద్యను భరించలేకపోతే లేదా సురక్షితమైన ఉద్యోగ వాతావరణం పొందలేకపోతే, ఆమెకు సమాన అవకాశాలు వాస్తవంగా నిరాకరించబడుతున్నట్లే.విద్యార్థులు తమ సమస్యలను భయపడకుండా వెల్లడించగలిగే సంస్థాగత వ్యవస్థల అవసరాన్ని కూడా ఈ చర్చ స్పష్టం చేసింది. విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సురక్షితమైన క్యాంపస్‌లు, సమర్థవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు, జవాబుదారీతనం కలిగిన అధికార వ్యవస్థలు, విద్యార్థులకు అందుబాటులో ఉండే సహాయ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

### తరగతి గది నుంచి వీధి పోరాటం వరకు

విద్యార్థులతో రాహుల్ గాంధీ సాగిస్తున్న సంభాషణ విద్య, సామాజిక సమస్యలకు మాత్రమే పరిమితం కాలేదు. అది నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి ప్రజాస్వామ్య అంశాల వరకు విస్తరించింది.జూలై 20న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనలో గాయపడిన విద్యార్థి సాహిల్ లోచబ్‌కు సంబంధించిన కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 21న న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ సుదీర్ఘంగా ధర్నా చేపట్టారు. అనంతరం ఢిల్లీ పోలీసులు లోచబ్ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.నజాఫ్‌గఢ్‌కు చెందిన యువ విద్యార్థి లోచబ్ నిరసన సందర్భంగా తనకు అనేక పెల్లెట్ గాయాలు తగిలాయని, కుడి కంటికి చూపు కోల్పోయానని ఆరోపించారు. ప్రమాదకర మార్గాల ద్వారా గాయపరచడం, ప్రాణాలకు లేదా వ్యక్తిగత భద్రతకు ముప్పు కలిగించడం వంటి ఆరోపణలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత నిబంధనల కింద ఎఫ్ఐఆర్ నమోదైంది.లోచబ్, అతని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన రాహుల్ గాంధీ, ఫిర్యాదు అధికారికంగా నమోదు అయ్యే వరకు అక్కడే ఉన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు కావడం న్యాయం దిశగా తొలి అడుగు మాత్రమేనని ఆయన పేర్కొంటూ, విద్యార్థుల నిరసనలపై బలప్రయోగం చేయడాన్ని ప్రశ్నించారు.ఈ ఘటన రాజకీయ వివాదానికి కూడా దారితీసింది. గాయపడిన విద్యార్థికి న్యాయం, జవాబుదారీతనం కోసం రాహుల్ గాంధీ నిరసన చేపట్టారని కాంగ్రెస్ నేతలు పేర్కొనగా, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి దీనిని రాజకీయ నాటకంగా విమర్శించారు.

### అసమ్మతి తెలిపే హక్కు

ఈ ఘటన ప్రజాస్వామ్యంలో అసమ్మతికి ఉన్న స్థానం అనే విస్తృతమైన ప్రశ్నను ముందుకు తెచ్చింది.భారత ప్రజాస్వామ్య చరిత్రలో విద్యార్థి ఉద్యమాలకు ప్రత్యేక స్థానం ఉంది. విశ్వవిద్యాలయాలు కేవలం విద్యను అందించే కేంద్రాలు మాత్రమే కావు. యువత రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకునే, అధికారాన్ని ప్రశ్నించే, సమాజ భవిష్యత్తుపై భిన్నమైన అభిప్రాయాలను చర్చించే ప్రజాస్వామ్య వేదికలు కూడా.అయితే శాంతియుత నిరసన హక్కుతో పాటు ప్రజా శాంతిని కాపాడే బాధ్యత కూడా ఉంటుంది. అదే సమయంలో, చట్టబద్ధమైన నిరసనలను ప్రభుత్వం సముచితమైన, పరిమితమైన విధానంలో నిర్వహించాల్సిన బాధ్యత కలిగి ఉంటుంది. బలప్రయోగం అధికమైందన్న ఆరోపణలు వస్తే వాటిపై స్వతంత్రంగా దర్యాప్తు జరగడం కూడా అత్యంత అవసరం.ఎఫ్ఐఆర్ నమోదు కావడం నేరం రుజువైనట్లు కాదు. అది చట్టపరమైన ప్రక్రియకు ఆరంభం మాత్రమే. ఆరోపణలపై దర్యాప్తు జరిపి, ఆధారాలను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఫిర్యాదులను అధికారికంగా నమోదు చేయడానికి సంస్థలు సిద్ధంగా ఉండటం కూడా ప్రజా జవాబుదారీతనంలో కీలకమైన అంశం.



### 'భారత భవిష్యత్తు'గా యువత

యువత తరానికి రాజకీయ స్వరంగా తనను తాను నిలబెట్టుకునే ప్రయత్నాన్ని రాహుల్ గాంధీ ఇటీవలి కాలంలో మరింతగా చేస్తున్నారు. యువతను భయపెట్టి మౌనంగా ఉంచలేమని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు చురుకైన పాత్ర పోషించాలని ఆయన చెబుతున్నారు.ఇది భారత రాజకీయాల్లో మారుతున్న వాస్తవ పరిస్థితిని కూడా ప్రతిబింబిస్తోంది. భారత యువత ఒక భారీ సామాజిక, రాజకీయ, ఎన్నికల శక్తి. అయితే వారి సమస్యలను కేవలం ఎన్నికల లెక్కలకే పరిమితం చేయలేం.నాణ్యమైన విద్య, ఉపాధి, గౌరవప్రదమైన జీవితం, భద్రత, సాంకేతిక అవకాశాలు, తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాల్లో తమకూ భాగస్వామ్యం వంటి అంశాలను యువత కోరుకుంటోంది.అందువల్ల రాజకీయ సవాలు కేవలం ఎన్నికల సమయంలో యువతను సమీకరించడం కాదు. ప్రజాజీవితంలో వారు అర్థవంతంగా పాల్గొనేలా శాశ్వతమైన ప్రజాస్వామ్య వేదికలను సృష్టించడం కూడా.

### రాజకీయ సమీకరణకు అతీతంగా

విద్యార్థులతో జరుగుతున్న ఇటీవలి సంభాషణలు రాజకీయ నాయకత్వం పాత్రపై కూడా ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి.రాజకీయ పార్టీలు కేవలం ఓట్లు కోరే సంస్థలుగా కాకుండా యువత మాట వినే నిజమైన వేదికలుగా మారగలవా? విద్య, ఉపాధి, భద్రతపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను స్పష్టమైన ప్రజా విధానాలుగా మార్చగలరా? సామాజిక ఉద్యమాలతో రాజకీయ నాయకులు వాటిని నియంత్రించే ప్రయత్నం చేయకుండా నిర్మాణాత్మకంగా కలిసి పనిచేయగలరా?మహిళా విద్యార్థుల విషయంలో ఈ ప్రశ్నలు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. వేధింపులు, సురక్షితం కాని రవాణా, ఆర్థిక పరిమితులపై వారు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు కేవలం చట్టాలు చేయడం ద్వారా సామాజిక సమానత్వం సాధ్యం కాదని సూచిస్తున్నాయి. దీనికి సంస్థాగత మార్పులు, మెరుగైన ప్రజా మౌలిక వసతులు, సామాజిక దృక్పథాల్లో మార్పు, ఆర్థిక అవకాశాల విస్తరణ అవసరం.

### మారుతున్న రాజకీయ సంభాషణ

పుణెలో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమం నుంచి సాహిల్ లోచబ్‌కు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన వరకు రాహుల్ గాంధీ ఇటీవల చేపట్టిన కార్యక్రమాలు సమకాలీన రాజకీయాల్లో పరస్పరం అనుసంధానమైన రెండు విభిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయి.ఒకటి పౌరుల మాట వినడం--- ముఖ్యంగా మరింత స్వేచ్ఛ, భద్రత, ఆర్థిక స్వావలంబన కోరుకుంటున్న యువతుల గొంతుకను వినడం. మరొకటి ప్రభుత్వ సంస్థల నుంచి జవాబుదారీతనం కోరుతున్న పౌరుల పక్షాన నిలబడటం.ఈ రాజకీయ విధానం భవిష్యత్తులో స్థిరమైన ప్రజా మద్దతుగా మారుతుందా లేదా అన్నది కాలమే నిర్ణయించాలి. అయితే విద్యార్థులు లేవనెత్తుతున్న సమస్యలు మాత్రం అంత సులభంగా కనుమరుగయ్యే అవకాశం లేదు.భారత యువత నుంచి వెలువడుతున్న సందేశం స్పష్టంగా ఉంది: విద్య అందరికీ అందుబాటులో ఉండాలి, క్యాంపస్‌లు సురక్షితంగా ఉండాలి, మహిళలు తమ జీవితాలపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కు కలిగి ఉండాలి, పౌరులు భయపడకుండా అధికారాన్ని ప్రశ్నించే స్వేచ్ఛను కలిగి ఉండాలి.భారత ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమైన ప్రశ్న యువత తరఫున ఎవరు మాట్లాడుతున్నారు అనేది మాత్రమే కాదు. యువత మాట వినడానికి, వారి సమస్యలకు స్పందించడానికి, దేశ భవిష్యత్తును నిర్మించడంలో వారికి అర్థవంతమైన పాత్ర కల్పించడానికి రాజకీయ వ్యవస్థ సిద్ధంగా ఉందా? అన్నదే అసలు ప్రశ్న.

# అధికారులసమన్వయం తో అభివృద్ధి,సంక్షేమ లక్ష్యాలను సాధించాలి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్....**

కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 24: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, అభివృద్ధి పనుల అమలులో ఆశించిన పురోగతి సాధించడానికి అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు... సోమవారం జిల్లా కలెక్టరేట్ నుండి మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో (ఎంపీడిఓలు) వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....విజిబి రామ్ జి పథకం కింద కూలీలకు పెద్దపీట వేస్తూ వేతన జీవులకు పనుల కల్పన ద్వారా సరాసరి వేతనం పొందే విధంగా ఉపాధి కల్పించాలని,పథకశీ అమల్లో పురోగతి ని ఇంకా పెంచాల్సి ఉందన్నారు..మెట్ట ప్రాంత మండలా లాలలో 100% ఉద్యానవన ప్లాంటేషన్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. జలధార -- జలహారతి రెండో దశ కింద 6 మండలాల్లో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి (గ్రౌండ్ చేసి) పూర్తి చేసి నివేదికలను పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. మిగిలిన మండలాల్లో పనులను గుర్తించి తక్షణమే ప్రతిపాద న లు వచ్చే వారానికి సిద్ధపరిచి అనుమతులు పొందాలని ఆదేశించారు. తద్వారా ప్రతి నీటి బొట్టు ను ఒడిసి పట్టి సద్విని యోగం చేసుకునేందుకు మార్గం సుగమశీ అవుతుందన్నారు. ఆ దిశగాపనులుప్రతిపాదించాలన్నారు అన్నాక్యాంటీన్ లను సమయానికి తెరవాలని క్లీనింగ్ పరిశుభ్రత, ఆహార నాణ్యత అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సంతృప్తి స్థాయి లను మెరుగుపరచాలన్నారు. గ్రామీణ -పట్టణ తాగు నీటి సరఫరా సమయానికి నాణ్యతతో సరఫరా చేయాలని, త్రాగునీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా మెలకువలు పాటించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రత, సాగునీటి సరఫరా,స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు' సిబ్బంది హాజరు,ప్రవర్తన మరియు ప్రభుత్వ సేవల అందించడం లోప్రజల సంతృప్తి స్థాయినిపెంచాలని స్పష్టం చేశారు.



### వెనుక బడిన మండలాల ఎంపీడిఓ లకు పురోగతిపై తగిన దిశానిర్దేశం చేశారు.

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద పెండింగ్‌లో ఉన్న 9 పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో తాగునీటి వసతులు, సోక్ పిట్ల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఓహెచ్ఎస్ఆర్ (హిఖా=) నిర్మాణం మరియు వాటి ట్యాంకుల క్లోరినేషన్ క్లీనింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మరియు డిఎంఎఫ్ (ఖవీఖీ) నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసేలా వేగం పెంచాలని ఆదేశించారు. పి 4 ద్వారా బంగారుకుటుంబాలను మార్గ దర్శకులకు దత్తత నిచ్చే కార్యక్రమాన్ని వేగవంతం చేసి పేదరిక నిర్మూలన దిశ గా అధికారులు చిత్తశుద్ధి తో ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలనన్నారు ఈ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ వివిఎస్ లక్ష్మణరావు,డ్వామా పిడి ఎస్ మధు సూదన్, జల వనరుల శాఖ ఈఈ శేషగిరి రావు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ ఈ మహమ్మద్ అబ్దుల్ మతిన్, తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా జాబ్ మేళా

### జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 24: జిల్లాలోని నిరుద్యోగ యువతకు విస్తృతమైన ఉద్యోగ అవకాశాలను కల్పించే లక్ష్యంతో జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో చిత్తూరులో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రికను సోమవారం గ్రీవెన్స్ హాల్ నందు స్కిల్ డెవలప్మెంట్ వారితో కలిసి ఆవిష్కరించారు. చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (ఎస్వీసీఈటీ) కళాశాలలో ఈ నెల 26, 27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సంస్థలు, పరిశ్రమలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ , ప్రీమియర్ ఎనర్జీస్, ఇసుజు, ఫాక్స్కాన్, ఫ్లిప్కార్ట్, ఎన్జీఎస్, అపోలో టయర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, టీంలీజ్, కియా తదితర 20కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా మేళాను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఉద్యోగార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించాలని కలెక్టర్ సూచించారు. యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ద్వారా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ




గుంటూరు, మహి న్యూస్, ఆగస్టు 24: జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారమవుతాయనే ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలి, డి పి ఓ సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, ఉచిత భోజన ఏర్పాట్లు కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు 171 అర్జీలు

### గ్రీవెన్స్ కు జిల్లా స్థాయి అధికారులే హాజరు కావాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 24: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి ప్రజల నుంచి 171 వినతులు నమోదయ్యాయి. సాయంత్రం 6.50 గంటల వరకు ఆన్‌లైన్ ద్వారా అందిన ఈ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేరుగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు మాత్రమే హాజరు కావాలని, సెకండ్ లెవెల్ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని తేల్చిచెప్పారు. ప్రజలు ఇచ్చే అర్జీలను స్వయంగా జిల్లా అధికారులే పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

### రెవెన్యూ శాఖకే అత్యధిక వినతులు

పీజీఆర్ఎస్‌కు అందిన మొత్తం 171 అర్జీల్లో అత్యధికంగా రెవెన్యూ (సీసీఎల్ఏ) శాఖకు సంబంధించి 88 వినతులు వచ్చాయి. పంచాయతీ రాజ్ శాఖకు 18, సర్వే సెటిల్మెంట్స్ మరియు ల్యాండ్ రికార్డ్స్ 9, సెర్ప్ 9, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 9, విద్యుత్ శాఖ 8, స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు 6, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ 4, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 3, సమగ్ర శిక్ష 3 చొప్పున అర్జీలు నమోదయ్యాయి. అదేవిధంగా ఏపీ ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, జలవనరులు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలకు చెరో 2 చొప్పున వినతులు వచ్చాయి. గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గ్రామీణాభివృద్ధి, ఏపీఎస్ఆర్టీసీ, హౌసింగ్ కార్పొరేషన్, పోలీసు, సివిల్ సప్లైస్, వ్యవసాయ శాఖ, మహిళా శిశు సంక్షేమం, టిడ్కో, మత్స్య శాఖ, ఆర్థిక శాఖలకు చెరో 1 చొప్పున అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు.

## ఈవీఎం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్




శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 24: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదాములను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాము ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘా పనితీరును పరిశీలించిన ఆయన, 24 గంటల పోలీసు బందోబస్తు వివరాలపై ఆరా తీశారు. అనంతరం లాగ్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్ల నిర్వహణను సరిచూసి, విధుల్లో ఉన్న రెవెన్యూ, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటు గోదాము భద్రతలో ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరరావు, కలెక్టర్ కార్యాలయ సి సెక్షన్ సిబ్బంది ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సమక్షంలోనే పంచాయతీ నిధులు స్వాహా..!

**సుమారు రూ.40--50 లక్షల విలువైన కలప మాయం..! అసలు కథ వెనుక ఎవరున్నారు? పంచాయతీ కార్యదర్శితో పాటు మండల అభివృద్ధి అధికారి పాత్రపైనా అనుమానాలు.. సమగ్ర విచారణకు గ్రామస్తుల డిమాండ్**

**ఓజిలి మండలం, తిరుపతి జిల్లా - ప్రత్యేక కథనం**
**తేదీ: 24-08-2026**



తిరుపతి జిల్లా ఓజిలి మండలం వీర్లగునపాడు--సగుటూరు గ్రామాలకు జీవనాధారంగా ఉన్న చెరువు కట్టపై దశాబ్దాలుగా పెరిగిన విలువైన చెట్లు ఏమయ్యాయి? సుమారు రూ.40--50 లక్షల వరకు విలువ ఉంటుందని స్థానికులు చెబుతున్న కలప ఇప్పుడు ఎక్కడుంది? ఎవరు నరికారు? ఎవరి అనుమతితో నరికారు? ఎవరికి విక్రయించారు? విక్రయం ద్వారా వచ్చిన డబ్బు ఎక్కడికి వెళ్లింది? ప్రభుత్వ ఖజానాలో జమ అయిందా? పంచాయతీ ఖాతాలోకి చేరిందా? లేక మరెవరి చేతుల్లోకి వెళ్లిందా? ఈ ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడంతో వీర్లగునపాడు--సగుటూరు ప్రాంతాల్లోనే కాకుండా ఓజిలి మండలవ్యాప్తంగా ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజా ఆస్తిగా భావించే చెరువు కట్టపై ఉన్న విలువైన కలప తొలగింపునకు సంబంధించి వేలం ప్రకటనలు, అధికారిక అనుమతులు, పంచాయతీ తీర్మానం, జంగిల్ క్లియరెన్స్/సంబంధిత అనుమతులు, కలప కొలతలు, విక్రయ రశీదులు, ఆదాయ వివరాలు, బ్యాంకు లావాదేవీలు వంటి కీలక పత్రాలు ప్రజల ముందుకు రాకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది.

పంచాయతీ కార్యదర్శి సమక్షంలోనే 'రహస్య వ్యవహారం' జరిగిందా?

స్థానికుల ఆరోపణల ప్రకారం చెరువు కట్టపై కలప తొలగింపు వ్యవహారంలో పంచాయతీ కార్యదర్శి పాత్రపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కలప తొలగింపు సమయంలో పంచాయతీ కార్యదర్శి సమక్షంలోనే ఎలాంటి ఒప్పందాలు లేదా సంప్రదింపులు జరిగాయా? కలపను నరికేందుకు పంచాయతీ అనుమతి ఉందా? సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్నారా? జంగిల్ క్లియరెన్స్ పేరుతో ఏదైనా అనుమతి పొందితే దాని పూర్తి వివరాలు ఏమిటి? ఆ అనుమతి ఆధారంగా ఎంత కలప తొలగించేందుకు అనుమతి ఉంది? వాస్తవంగా ఎంత కలప నరికారు?

ఈ ప్రశ్నలకు అధికారిక పత్రాలతో సమాధానం రావాల్సి ఉంది.

ప్రజా ఆస్తికి సంబంధించిన లక్షల రూపాయల విలువైన కలప వ్యవహారం కావడంతో ప్రతి దశకు రికార్డు ఉండాల్సిందే.

చెట్లను నరికేందుకు అనుమతి ఎవరు ఇచ్చారు?

జంగిల్ క్లియరెన్స్ ఎవరి ద్వారా, ఏ ప్రాతిపదికన పొందారు?

కలపను కొలిచింది ఎవరు?

కలపను తరలించేందుకు అనుమతి ఎవరిది?

ఎవరికి విక్రయించారు?

ఎంతకు విక్రయించారు?

వేలం నిర్వహించారా?

వేలం జరిగితే పూర్తి వివరాలు ఎక్కడ ఉన్నాయి?

అనే ప్రశ్నలు ఇప్పుడు అధికారుల ముందున్నాయి.

రూ.40--50 లక్షల కలపకు లెక్క ఎక్కడ?

స్థానికుల అంచనా ప్రకారం చెరువు కట్టపై ఉన్న కలప విలువ సుమారు రూ.40--50 లక్షల వరకు ఉండొచ్చని చెబుతున్నారు.

అంత విలువైన ప్రజా ఆస్తి తొలగించబడినప్పుడు దాని ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందా లేదా అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

వేలం నిర్వహించారా?

వేలం నోటీసు ఎక్కడ?

వేలంలో పాల్గొన్నవారు ఎవరు?

అత్యధిక ధర ఎవరు కోట్ చేశారు?

కలపను ఎవరు కొనుగోలు చేశారు?

విక్రయ రశీదు ఎక్కడ?

వచ్చిన మొత్తం ఏ ఖాతాలో జమ అయింది?

ఈ వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

"ప్రభుత్వ లేదా పంచాయతీ ఆస్తి అయితే దాని ద్వారా వచ్చిన ఆదాయం సంబంధిత ప్రభుత్వ/పంచాయతీ ఖాతాలోకి వెళ్లాలి. మరి కలప ఎక్కడికి వెళ్లింది? ఆదాయం ఎక్కడ జమ అయింది?" అంటూ గ్రామస్తులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ఇతర గ్రామాల్లో చెరువు కట్ట పనులు పూర్తి.. ఇక్కడే ఎందుకు ఆలస్యం?

కురుగొండ, అత్తివరం, తిరుమలపూడి గ్రామాల్లోని చెరువు కట్ట పనులు దాదాపు పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే వీర్లగునపాడు--సగుటూరు చెరువు కట్ట పనులు మాత్రం ఎందుకు ఆలస్యమయ్యాయి? కలప తొలగింపు అంశాన్ని కారణంగా చూపుతూ పనులు నిలిపివేశారా? లేక కలప విలువను దృష్టిలో పెట్టుకుని తొలగింపు వ్యవహారాన్ని సాగదీశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో ఈ వ్యవహారంలో సంబంధిత శాఖకు చెందిన మండల అభివృద్ధి అధికారి (వీణా) పాత్రపైనా గ్రామస్తుల్లోనూ, ఉన్నతాధికారుల స్థాయిలోనూ చర్చ జరుగుతున్నట్లు సమాచారం. వీణాకి ఈ వ్యవహారం గురించి ముందుగానే సమాచారం ఉందా? చెరువు కట్ట పనులు, కలప తొలగింపు, పంచాయతీ స్థాయిలో జరిగిన ప్రక్రియపై ఆయనకు ఎలాంటి సమాచారం అందింది? ఏమైనా అధికారిక ఆదేశాలు లేదా పర్యవేక్షణ జరిగిందా? జరిగితే వాటి రికార్డులు ఏమిటి? అనే అంశాలు కూడా ఇప్పుడు విచారణ పరిధిలోకి రావాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

అయితే వీణా లేదా పంచాయతీ కార్యదర్శి ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించడం కాదు. వారి పాత్రపై వినిపిస్తున్న ఆరోపణలు, అనుమానాలు వాస్తవమా కాదా అన్నది అధికారిక విచారణలోనే తేలాలి.

పంచాయతీ నిధులు ఎక్కడికి వెళ్లాయి?

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్న ఇదే.

కలపను విక్రయించి డబ్బు వచ్చినట్లయితే ఆ మొత్తం ఎక్కడ ఉంది?

పంచాయతీ ఖాతాలో జమ అయిందా?

ఎంత మొత్తం జమ చేశారు?

ఏ తేదీన జమ చేశారు?

ఏ బ్యాంకు ఖాతాలో జమ చేశారు?

దానికి సంబంధించిన రసీదు ఉందా?

ఖాతా పుస్తకాల్లో నమోదు చేశారా?

పంచాయతీ తీర్మానం ఉందా?

వేలం ప్రక్రియకు సంబంధించిన ఫైల్ ఎక్కడ ఉంది?

ఈ పత్రాలన్నీ ఉంటే ప్రజల ముందు పెట్టడానికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని గ్రామస్తులు అంటున్నారు.

"కలప నరికారు.. కలప తరలించారు.. మరి డబ్బు ఎక్కడ?"

అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిందే.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు.. ఇకనైనా సమగ్ర విచారణ జరుగుతుందా?

ఈ వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. గ్రీవెన్స్ డే కార్యక్రమంలోనూ సంబంధిత అంశంపై ఫిర్యాదు అందినట్లు తెలుస్తోంది.

ఇకనైనా కేవలం కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణలో భాగంగా---

చెరువు కట్టపై గతంలో ఉన్న చెట్ల సంఖ్య,

ప్రస్తుతం మిగిలిన చెట్ల సంఖ్య,

నరికిన చెట్ల సంఖ్య,

కలప పరిమాణం,

కలప వాస్తవ మార్కెట్ విలువ,

జంగిల్ క్లియరెన్స్ లేదా ఇతర అనుమతుల వివరాలు,

వేలం ప్రక్రియ,

కొనుగోలుదారుల వివరాలు,

రవాణా వివరాలు,

విక్రయ మొత్తం,

పంచాయతీ/ప్రభుత్వ ఖాతాలో జమ అయిన మొత్తం,

పంచాయతీ కార్యదర్శి నిర్వహించిన రికార్డులు,

వీణా స్థాయిలో జరిగిన పర్యవేక్షణ లేదా ఆదేశాలు

వంటి అంశాలన్నింటినీ పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అధికారుల ముందున్న సూటి ప్రశ్నలు

చెరువు కట్టపై ఉన్న చెట్లను నరికింది ఎవరు?

ఎవరి అనుమతితో నరికారు?

జంగిల్ క్లియరెన్స్ అనుమతి ఉంటే దాని కాపీ ఎక్కడ?

కలపను కొలిచింది ఎవరు?

ఎంత పరిమాణంలో కలప వచ్చింది?

కలపను తరలించింది ఎవరు?

ఎవరికి విక్రయించారు?

ఎంత మొత్తానికి విక్రయించారు?

వేలం నిర్వహించారా?

వేలం జరిగితే పూర్తి వివరాలు ఎక్కడ?

పంచాయతీ తీర్మానం ఉందా?

సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా?

కలప విక్రయం ద్వారా వచ్చిన ఆదాయం ఎంత?

ఆ మొత్తం ఏ ఖాతాలో జమ అయింది?

బ్యాంకు లావాదేవీల వివరాలు ఏమిటి?

పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ఏమైనా ప్రక్రియ జరిగిందా?

ఈ వ్యవహారంపై వీణాకి సమాచారం ఉందా?

ఉంటే ఆయన స్థాయిలో ఏ చర్యలు లేదా పర్యవేక్షణ జరిగింది?

రూ.40--50 లక్షల వరకు విలువ ఉంటుందని చెబుతున్న కలపకు పూర్తి లెక్కలు ఎందుకు బహిర్గతం చేయడం లేదు?

ఆరోపణలు నిజమైతే చర్యలు.. అసత్యమైతే పత్రాలతో సమాధానం

ఈ వ్యవహారంలో ఎవరినీ ముందుగానే దోషులుగా నిర్ధారించడం కాదు. అయితే ప్రజా ఆస్తికి సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు వెలువడినప్పుడు వాటిపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరపడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదే సమయంలో ఆరోపణలు అసత్యమైతే సంబంధిత అధికారులు అనుమతులు, జంగిల్ క్లియరెన్స్ పత్రాలు, వేలం రికార్డులు, విక్రయ రశీదులు, బ్యాంకు జమ వివరాలు, పంచాయతీ తీర్మానాలు, సంబంధిత అధికారుల ఆదేశాలు ప్రజల ముందుంచి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

లేకపోతే ప్రజల్లో ఇప్పటికే ఉన్న అనుమానాలు మరింత బలపడే పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు అంటున్నారు.

ప్రజా ఆస్తికి లెక్క చెప్పాల్సిందే!

చెరువులు ప్రజల ఆస్తులు. వాటి కట్టలు, వాటిపై ఉన్న ప్రభుత్వ లేదా స్థానిక సంస్థల ఆస్తుల సంరక్షణ సంబంధిత అధికారుల బాధ్యత.

ప్రజా ఆస్తి నుంచి ఒక్క రూపాయి ఆదాయం వచ్చినా దానికి లెక్క ఉండాలి. లక్షల రూపాయల విలువైన కలప మాయమైందనే ఆరోపణలు వచ్చినప్పుడు మాత్రం ప్రతి రూపాయికి లెక్క చూపాల్సిందే.



వీర్లగునపాడు--సగుటూరు చెరువు కట్టపై కలప వ్యవహారంలో అసలు నిజం ఏమిటి?

చెట్లు నరికింది ఎవరు..?

తరలించింది ఎవరు..?

విక్రయించింది ఎవరికి..?

ధర నిర్ణయించింది ఎవరు..?

వచ్చిన డబ్బు ఎక్కడ జమ అయింది..?

పంచాయతీ ఖాతాలో ఎంత ఉంది..?

పంచాయతీ కార్యదర్శి సమక్షంలో ఏం జరిగింది..?

వీణాకి ఏం తెలుసు..?

ఈ వ్యవహారంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

ప్రజా ఆస్తికి లెక్క చెప్పేది ఎవరు..?

ఇప్పుడు ఈ ప్రశ్నలకు పత్రాలతో సమాధానం చెప్పాల్సిన సమయం సంబంధిత అధికారులదే.

"ప్రజా ఆస్తి మాయం అయితే.. లెక్కలు బయటకు రావాల్సిందే.

ప్రజాధనం అయితే.. ప్రజలకే జవాబు చెప్పాల్సిందే!"

## 'ప్రామాణిక కోడింగ్ లేకుండా కులగణన ప్రయోజనం ఉండదు'

### కులగణన-2027పై యోగేంద్ర యాదవ్ ఆందోళన.. బీసీ సంఘాల డిమాండ్.

అమరావతి మహి న్యూస్ ఆగష్టు 24: కులగణన-2027లో ఇతర వెనుకబడిన తరగతుల కులాల వివరాలను ప్రామాణిక కోడింగ్ వ్యవస్థ లేకుండా ఓపెన్-ఎండెడ్ విధానంలో సేకరిస్తే, భారీగా గందరగోళానికి దారితీసి సామాజిక న్యాయానికి అవసరమైన విశ్వసనీయ డేటా అందకుండా పోయే ప్రమాదం ఉందని సామాజిక-రాజకీయ విశ్లేషకుడు, సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ లో "ఓపెన్ కాస్ట్ కాలమ్, క్లోజ్డ్ జస్టిస్: ది ఇన్‌జస్టిస్ ఇన్ సెన్సస్ 2027" అనే అంశంపై వివిధ బీసీ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రతిపాదిత విధానంలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయని, ముందస్తు ప్రామాణిక వర్గీకరణ, కోడింగ్ విధానం లేకుండా కులాల పేర్లను మాత్రమే సేకరిస్తే భవిష్యత్‌లో ఆ డేటాను సమర్థవంతంగా వినియోగించడం కష్టమవుతుందని అన్నారు.

### ఓపెన్-ఎండెడ్ ప్రశ్నలతో గందరగోళం

దేశంలోని సుమారు 140 కోట్ల మంది ప్రజలను ఓపెన్-ఎండెడ్ ప్రశ్న ద్వారా కుల వివరాలు అడిగితే, ఒకే కులానికి వివిధ ప్రాంతాల్లో ఉపయోగించే పేర్లు, స్థానిక పేర్లు, ఉపకులాల పేర్లు, భిన్నమైన స్పెల్లింగ్‌లు, పర్యాయపదాలు వేర్వేరు కులాలుగా నమోదయ్యే అవకాశం ఉందని యాదవ్ వివరించారు. ఫలితంగా ఒకే సామాజిక సమూహానికి సంబంధించిన వివరాలు అనేక వర్గాలుగా విడిపోయి, తుది గణాంకాలు విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. "కులాల పేర్లను సేకరించడం మాత్రమే సరిపోదు. సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, ఆధారిత విధాన రూపకల్పనకు ఉపయోగపడేలా విశ్వసనీయమైన, ప్రామాణికమైన, వినియోగయోగ్యమైన డేటాను రూపొందించాలి" అని ఆయన పేర్కొన్నారు. 2011 ఎస్ఈసిసి అనుభవం పునరావృతం కాకూడదుకుల వివరాల సేకరణలో పరిపాలనా స్పష్టత లేకపోవడం గతంలో జరిగిన 2011 సామాజిక-ఆర్థిక కులగణన అనుభవాన్ని గుర్తు చేస్తోందని యాదవ్ అన్నారు. కులాల గుర్తింపు, వర్గీకరణ, డేటా శుద్ధి విషయంలో స్పష్టమైన విధానం లేకపోతే సేకరించిన సమాచారం విధాన నిర్ణయాలకు ఉపయోగపడకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది కేవలం సాంకేతిక సమస్య కాదని, రాజకీయ సంకల్పానికి సంబంధించిన అంశమని యాదవ్ స్పష్టం చేశారు. సమగ్ర కుల డేటా అందుబాటులోకి వస్తే సామాజిక వెనుకబాటుతనంపై స్పష్టమైన చిత్రం వెలుగులోకి వస్తుందని, అందువల్ల బీసీ జనాభా, వారి సామాజిక-ఆర్థిక పరిస్థితులపై నమ్మదగిన సమాచారం అందకుండా చేసే విధంగా వ్యవస్థను రూపొందించకూడదని అన్నారు.

### ఎస్సీ, ఎస్టీ తరహాలో ప్రామాణిక కోడింగ్ అవసరం

కులగణనలో ప్రామాణిక కోడింగ్ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని యాదవ్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ముందుగానే స్పష్టమైన కోడ్‌లు, వర్గీకరణ ప్రమాణాలు రూపొందించి, దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయాలని అన్నారు. ఇలా చేయడం ద్వారా ప్రాంతీయ పేర్లు, పర్యాయపదాలు, భిన్నమైన స్పెల్లింగ్‌లు, ఉపకులాల వివరాలను సమర్థవంతంగా సమీకరించి, ఖచ్చితమైన కుల గణాంకాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు.

### ఒక్కసారి చేసే జనగణనకు పరిమితం కాకూడదు

కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి పదేళ్లకోసారి జరిగే సాధారణ జనగణనలో కుల వివరాలను నమోదు చేయడం



మాత్రమే సరిపోదని యాదవ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయం, ఉపాధి, ఆదాయం, విద్య, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై జరిగే వివిధ ప్రభుత్వ సర్వేల్లో కూడా కులానికి సంబంధించిన ప్రశ్నలను సమర్థవంతంగా అనుసంధానం చేయాలని సూచించారు. ఇలాంటి "చిన్న-సి జనగణనలు" ద్వారా కాలానుగుణంగా సామాజిక-ఆర్థిక మార్పులను అంచనా వేసే అవకాశం ఉంటుందని అన్నారు. కుల డేటాను ఒకే భారీ గణనకు పరిమితం చేయకుండా, వివిధ రంగాల గణాంకాలతో అనుసంధానం చేస్తే ప్రభుత్వ విధానాలు మరింత ఆధారబద్ధంగా రూపొందించవచ్చని పేర్కొన్నారు.

### కులగణన వాయిదా వేయాలని బీసీ సంఘాల డిమాండ్

ఇదిలా ఉండగా, కులగణన-2027లో ఓబిసి కులాల గణనను ప్రామాణిక కోడ్‌లను ఖరారు చేసే వరకు వాయిదా వేయాలని వివిధ బీసీ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విజయవాడ లో జరిగిన మీడియా సమావేశంలో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ తదితర సంఘాల ప్రతినిధులు ఈ డిమాండ్ చేశారు. ప్రామాణిక కోడింగ్ లేకుండా ఓపెన్ కాస్ట్ కాలమ్ ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో కులాల వారీగా జనాభా, సామాజిక-ఆర్థిక స్థితిగతులపై సరైన గణాంకాలను రూపొందించడం కష్టమవుతుందని వారు అన్నారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని న్యూఢిల్లీ వరకు తీసుకెళ్తామని బీసీ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఈ సమావేశంలో టి. చిరంజీవులు, (బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం), డా. ఎం. సురేష్ బాబు, డా. ఉద్దండం చంద్రశేఖర్, ప్రొఫెసర్ సుకుమార్ నారాయణ్, టి స్పార్క్ ఎడిటర్ షేక్ బాబా తదితర బీసీ నాయకులు, మేధావులు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్‌తో చర్చించారు.

# ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత

### ప్రజలకు నగరపాలక సేవలు సులభంగా అందేలా చర్యలు

### 17 ప్రజా ఫిర్యాదుల స్వీకరణ – సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

### నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: నగరపాలక సేవలు ప్రజలకు సులభంగా, వేగంగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ కాలనీలకు సంబంధించిన 17 ఫిర్యాదులను కమిషనర్ స్వీకరించారు. ఆయా సమస్యలను పరిశీలించి, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో






పనిచేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు మెరుగైన నగరపాలక సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, కార్యదర్శి నాగరాజు, డీసీపీ శబ్నం శాస్త్రి, ఏసీపీ నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్వోలు వాజిద్, క్రిస్టోఫర్, మంజూర్ బాష, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారులతో నేరుగా మాట్లాడి సంతృప్తికరంగా సమస్యలు పరిష్కరించాలి

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో

### అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, సంతృప్తికరంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన పరిష్కార వివరాలతో కూడిన ఎండార్స్‌మెంట్‌ను అందించాలని సూచించారు. అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీని పరిష్కరించే అధికారి ప్రతి ఫిర్యాదును పూర్తిగా పరిశీలించి, వాస్తవాలను





తెలుసుకున్న అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించుకోవాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో రీ–ఓపెన్ అయిన కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న అర్జీలను కూడా సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న 'రీ–ఓపెన్', 'ఇంప్రాపర్ రెడ్రెసల్' కేసులను పూర్తిగా తగ్గించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు నగరంలో శబ్ద కాలుష్యంపై ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్

### 55 వాహనాలపై ఎంవీఐ ఈ–చలాన్లు

### మోడిఫైడ్ సైలెన్సర్లు, అధిక శబ్దం చేసే హారన్లపై ప్రత్యేక తనిఖీలు



కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: కర్నూలు నగరంలో శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో సోమవారం ఓల్డ్ పీసీఆర్ సర్కిల్ పరిసర ప్రాంతాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. తనిఖీల్లో అధిక శబ్దం చేస్తున్న 5 మోడిఫైడ్ సైలెన్సర్లు కలిగిన ద్విచక్ర వాహనాలను గుర్తించారు. ఆయా వాహనాల నుంచి మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పెద్ద శబ్దంతో హారన్లు వినియోగిస్తున్న 50 ఆటోలను గుర్తించి, వాటి హారన్లను తొలగించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన మొత్తం 55 వాహనాలపై ఎంవీఐ చట్టం ప్రకారం ఈ–చలాన్లు విధించారు. పాఠశాలలు, ఆసుపత్రులు, నివాస ప్రాంతాల్లో అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. వాహనదారులు మోడిఫైడ్ సైలెన్సర్లు, అధిక శబ్దం చేసే హారన్లను వినియోగించకుండా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.



## ఓర్వకల్లు జాతీయ రహదారిపై నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం

### నయారా పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: ఓర్వకల్లు జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన నయారా పెట్రోల్ బంక్‌ను పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పెట్రోల్ బంక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా పెట్రోల్ బంక్ అందుబాటులోకి రావడంతో ఓర్వకల్లు జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ పెట్రోల్ బంక్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 95 ఫిర్యాదులు

### ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు

### కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూలు కొత్తపేటలోని కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎస్పీ స్వయంగా విని, ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 95 ఫిర్యాదులు అందాయి. వాటిలో ముఖ్యమైన కొన్ని ఫిర్యాదులు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగం పేరుతో మోసం: హైదరాబాద్‌లో ఐటీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి, హైదరాబాద్‌కు చెందిన సల్మాన్ తన వద్ద నుంచి రూ.3.60 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు వన్‌టౌన్‌కు



చెందిన ప్రకాష్ నాయక్ ఫిర్యాదు చేశారు.

నకిలీ బంగారంతో మోసం: తన తండ్రికి రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.10 లక్షలకు బంగారం ఇస్తామని చెప్పి, తొలుత నమూనాలు చూపించి నమ్మించారని, డబ్బులు తీసుకున్న అనంతరం నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసి వెళ్లిపోయారని ఆదోని పట్టణానికి చెందిన తాహేర్ భాషా ఫిర్యాదు చేశారు.

ఫ్రాంఛైజీ పేరుతో రూ.9.15 లక్షల మోసం: జప్టో ఫ్రాంఛైజీ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ పంపి, ప్రాసెసింగ్ ఫీజు, అడ్వాన్స్, స్టోర్ విజిట్ తదితర పేర్లతో విడతల వారీగా మొత్తం రూ.9.15 లక్షలు తీసుకుని మోసం చేశారని, డబ్బులు రికవరీ చేసి న్యాయం చేయాలని ఆదోని హనుమాన్ నగర్‌కు చెందిన సతీష్ ఫిర్యాదు చేశారు.

ఉద్యోగం పేరుతో మోసం: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.1 లక్ష తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కల్లూరు మండలం దూపాడుకు చెందిన జస్వంత్ ఫిర్యాదు చేశారు.

రుణం చెల్లింపునకు గడువు కోరుతూ ఫిర్యాదు: స్మాల్ ఫైనాన్స్ పేరుతో తక్కువ వడ్డీకి రుణం ఇస్తామని చెప్పి రూ.6 లక్షల రుణం ఇచ్చారని, మిగిలిన మొత్తాన్ని చెల్లించలేకపోవడంతో ఇంటిని వేలం వేసి సీజ్ చేశారని, డబ్బులు చెల్లించేందుకు గడువు ఇప్పించి న్యాయం చేయాలని ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఆవుల పుల్లయ్య ఫిర్యాదు చేశారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, పార్థసారథి, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# పేదలు, వ్యవసాయ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నంద్యాల జిల్లా/బనగానపల్లె మహి న్యూస్, ఆగస్టు 24: పేదలు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద




నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం ఆర్డీవో నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో నాగరాజు, తహసీల్దార్ చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి శివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు సంజీవులు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి అవకాశాలు లేక అనేక కుటుంబాలు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.




### ప్రధాన డిమాండ్లు

ఉపాధి హామీ పనులను వెంటనే ప్రారంభించి, పేదలు, వ్యవసాయ కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలి.

కరువు పరిస్థితుల నుంచి వ్యవసాయ కూలీలను ఆదుకునేందుకు ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేల కరువు పెన్షన్ ఇవ్వాలి.

నిత్యావసర వస్తువులను ఉచితంగా అందించాలి.

రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థుల ఫీజులను రద్దు చేసి, వారి విద్యకు పూర్తి సహకారం అందించాలి.

ఎన్నికల హామీ మేరకు గ్రామాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలి.

రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించి, ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి.

22–ఏలో చేర్చిన పేదల భూముల సమస్యలను పరిష్కరించి, వారికి ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని రకాల సహాయం అందించాలి.

దశాబ్దాలుగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేసి, ఆ భూములపై వారికి సర్వహక్కులు కల్పించాలి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఉపాధి చట్టాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి.

అటవీ హక్కుల చట్టాన్ని సమర్థంగా అమలు చేసి, అటవీ హక్కులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి ఆదివాసీలు, గిరిజనులకు న్యాయం చేయాలి.

పేదలకు సామాజిక న్యాయం అందించేందుకు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయం అందించాలి.

అర్హత కలిగిన నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలి.

పేదలు, వ్యవసాయ కూలీలు, గిరిజనులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖాదర్‌బాషా, సుబ్బయ్య, ఏఐటీయూసీ నాయకులు కొత్తూరు, మాల మహానాడు సంఘం నాయకులు నాగరాజు, శివనాయక్‌తో పాటు వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

# హాస్టళ్లలో ఆహార నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదు

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### హాస్టళ్ల నిర్వహణపై అధికారులతో సమీక్ష

### బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత



ఆలూరు, ఆగస్టు 24: మహి న్యూస్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత అధికారులను, హాస్టల్ వార్డెన్లను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పౌష్టికాహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సోమవారం ఆలూరు మండల కేంద్రంలో వసతి గృహాల నిర్వహణ, చేనేత, జౌళి శాఖకు సంబంధించిన అంశాలపై మంత్రి ఎస్. సవిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో తమ పిల్లలను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు భోజనం వడ్డించే ముందు వార్డెన్లు, సంబంధిత సిబ్బంది ఆహారాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను నిర్ధారించుకోవాలని సూచించారు. భోజనం రుచికరంగా, నాణ్యంగా, విద్యార్థుల ఆరోగ్యానికి అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఫుడ్ క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అవసరమైన వనరులను సమకూరుస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం అధికారుల ప్రధాన బాధ్యతగా భావించాలని సూచించారు. హాస్టల్ వ్యవస్థను మరింత మెరుగుపరచడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. శాశ్వత హాస్టల్ భవనాల నిర్మాణం, అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు వార్డెన్లు హాస్టళ్లలో అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. హాస్టల్ నిర్వహణలో వార్డెన్ల పాత్ర కీలకమని, విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. వార్డెన్లు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పోస్టులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో ప్రతి శాఖ పనితీరులో మరింత మెరుగుదల కనిపించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. హాస్టళ్లలో సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో పూర్తి బాధ్యతతో పనిచేసి, ప్రభుత్వ ప్రతిష్ట పెరిగేలా ప్రతి అధికారి, వార్డెన్, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, వారి ద్వారా అవసరమైన టేబుళ్లు, ఫర్నిచర్ తదితర సామగ్రిని సమకూర్చడంతో పాటు సీఎస్ఆర్ నిధులు, వ్యాపారవేత్తల సహకారాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

### నేతన్న సేవలో రెండో విడత ప్రక్రియను వారంలోగా పూర్తి చేయాలి

నేతన్న సేవ పథకం రెండో విడతలో అర్హత కలిగిన ప్రతి నేతన్నకు ప్రభుత్వ ప్రయోజనం అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఎస్. సవిత అధికారులను ఆదేశించారు. చేనేత రంగానికి సంబంధించిన పథకాల అమలు, లబ్ధిదారుల డేటా, పెండింగ్ దరఖాస్తులు, సిస్టమ్ వెరిఫికేషన్ తదితర అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాలకు సంబంధించిన నేతన్నల వివరాలను పరిశీలించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, అర్హత ఉన్న ఏ ఒక్క నేతన్న కూడా ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే నేతన్న సేవ కార్యక్రమం, జాతీయ చేనేత దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని రెండో విడత ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే 100 శాతం పార్టిసిపేషన్ సాధించిన ప్రాంతాలను ఆదర్శంగా తీసుకుని, ఇంకా సాచ్యురేషన్ సాధించని ప్రాంతాల్లో అర్హులైన నేతన్నలందరినీ గుర్తించి వచ్చే వారం రోజుల్లో ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చేనేత సొసైటీలు, షోరూమ్‌లలో ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు ప్రత్యేక మార్కెటింగ్ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులను సంప్రదించి చేనేత ఉత్పత్తుల కొనుగోళ్లను ప్రోత్సహించాలని తెలిపారు. చేనేత ఉత్పత్తులపై అందుబాటులో ఉన్న రాయితీలు, డిస్కౌంట్లపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత పేర్కొన్నారు. జిల్లాలో నేతన్నలకు అందుతున్న ఉచిత విద్యుత్, నూతన నేతన్న సేవలో పథకం అమలు తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి నేతన్నకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని ఏడి నాగరాజును ఆదేశించారు.



### యువతకు విరివిగా రుణాలు అందించాలి

వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా యువతకు అందుతున్న సౌకర్యాలపై మంత్రి సమీక్షించారు. యువతకు విరివిగా రుణాలు ఇప్పించి, వారి జీవనోపాధికి కృషి చేయాలని జీఎం డీఐసీ సంజీవరాజు, ఇన్‌చార్జ్ ఏడి ఖాదీ గ్రామ ఉద్యోగ్‌ను ఆదేశించారు. లేపాక్షి సంస్థ కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో మంచి లాభాలతో కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అందిస్తున్న డిస్కౌంట్ల వివరాలను విస్తృతంగా తెలియజేసి వ్యాపార అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను ఆహ్వానించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అమ్మకాలను మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని లేపాక్షి సంస్థ మేనేజర్‌ను ఆదేశించారు. ఈ సమీక్షలో బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన, బీసీఈడీ జాకీర్ హుస్సేన్, ఏడి హ్యాండ్లూమ్స్ నాగరాజు, జీఎం డీఐసీ సంజీవరాజు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు, లేపాక్షి మరియు ఆప్కో మేనేజర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సేవా సంస్థల సిబ్బందికి మిశ్రమ విధానంలో శిక్షణ

## పరిపాలన, అంకీయ సాంకేతికత, న్యాయ సేవలపై సిబ్బందికి అవగాహన

## ఈ-కార్యాలయ వ్యవస్థ, అంకీయ దస్త్రాల నిర్వహణ, నివేదికల తయారీపై ప్రత్యేక శిక్షణ



కర్నూలు, ఆగస్టు 24: మహి న్యూస్: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీల వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో న్యాయ సేవా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి మిశ్రమ విధానంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కర్నూలు న్యాయ సేవా సదన్, జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవా సంస్థ, మండల న్యాయ సేవా కమిటీలు, శాశ్వత లోక్ అదాలత్, న్యాయ సహాయ రక్షణ న్యాయవాది వ్యవస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి పరిపాలన, అంకీయ సాంకేతికత, న్యాయ సేవలకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించారు. కార్యాలయ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు అవసరమైన పలు ముఖ్యమైన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఈ-కార్యాలయ వ్యవస్థ, అంకీయ దస్త్రాల నిర్వహణ, కేసుల నమోదు, సమాచార నిర్వహణ, అంతర్జాల ఫిర్యాదుల పరిష్కార విధానాలు, సంబంధిత సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలను వివరించారు. కార్యాలయాల్లో దస్త్రాలను అంకీయ విధానంలో క్రమబద్ధంగా నిర్వహించడం, దస్త్రాల కదలికను పర్యవేక్షించడం, సమాచార భద్రతను పాటించడం, పెండింగ్‌లో ఉన్న అంశాలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. అలాగే నెలవారీ, త్రైమాసిక, వార్షిక నివేదికలను నిర్దేశిత నమూనాల్లో, నిర్ణీత గడువులో, ఖచ్చితమైన సమాచారంతో సిద్ధం చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. నివేదికల తయారీలో గణాంకాల ఖచ్చితత్వం, రికార్డుల ఆధారంగా సమాచారాన్ని నమోదు చేయడం, సమయపాలన ప్రాముఖ్యతను వివరించారు. సిబ్బంది సేవా రిజిస్టర్లను నిబంధనల ప్రకారం నిర్వహించడం, సేవకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడం, అవసరమైన రికార్డులను సక్రమంగా భద్రపరచడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఆర్థిక నిర్వహణకు సంబంధించి నిధుల వినియోగం, బడ్జెట్ తయారీ, కొనుగోలు ప్రక్రియలు, ఆర్థిక జవాబుదారీతనం, వస్తు సేవల పన్ను, మూలం వద్ద పన్ను కోత, చట్టబద్ధమైన పన్ను నివేదికల దాఖలు వంటి అంశాలపై శిక్షణ అందించారు. ప్రభుత్వ నిధులను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సమాచార హక్కు చట్టం, రికార్డుల నిర్వహణ, రికార్డుల సంరక్షణ, సమాచారాన్ని నిబంధనల ప్రకారం అందించే విధానంపై కూడా వివరించారు. కార్యాలయ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వెబ్ వేదిక వినియోగం, అందులో అవసరమైన సమాచారాన్ని సమయానుకూలంగా నమోదు చేయడం, సమాచారాన్ని సక్రమంగా నవీకరించడం, న్యాయ సేవలకు సంబంధించిన కార్యకలాపాలను అంతర్జాలంలో సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి అంశాలపై సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన న్యాయ సేవలు అందించడంలో ఈ శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



# విద్యార్థి మృతికి బాధ్యులైన డీడీని సస్పెండ్ చేయాలి

## కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..

## పెన్నార్ భవన్ వద్ద విద్యార్థి, ప్రజా సంఘాల ధర్నా



అనంతపురం, మహి న్యూస్ ఆగస్టు 24: అనంతపురం జిల్లా సెట్టూరు మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో గోడ కూలి 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ మృతి చెందడం, మరో విద్యార్థి తేజ తీవ్రంగా గాయపడిన ఘటనపై విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో కనీస సదుపాయాలు లేకపోవడం, భవన నిర్మాణం, మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపమే ఘటనకు కారణమని ఆరోపిస్తూ సోమవారం అనంతపురం నగరంలోని పెన్నార్ భవన్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి మృతికి బాధ్యత వహిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అభివృద్ధి అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌పై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్టల్ భవన మరమ్మతుల కోసం కేటాయించిన రూ.10 లక్షల నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని మధు ప్రసాద్ డిమాండ్ చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకం పనులు చేపట్టినట్లు ఆరోపించారు. మరమ్మతుల్లో నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టడంతో పాటు, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు కోరారు. ప్రమాదకర స్థితిలో ఉన్న హాస్టల్ భవనాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. గోడ కూలిన ఘటనలో మృతి చెందిన విద్యార్థి హర్షవర్ధన్ కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం అందించాలని, తీవ్రంగా గాయపడిన విద్యార్థి తేజకు మెరుగైన వైద్యం పూర్తిగా ఉచితంగా అందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భద్రత విషయంలో ఇకపై నిర్లక్ష్యాన్ని సహించేది లేదని నాయకులు స్పష్టం చేశారు. హాస్టళ్లలో మౌలిక వసతులు, భవనాల భద్రత, నిధుల వినియోగంపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకుడు కేపీ నారా, ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక అనంతపురం జిల్లా ఇన్‌చార్జ్ గూళ్యం నాగభూషణం, అప్ప జిల్లా అధ్యక్షుడు మద్దెలచెరువు వెంకీ, ఎస్సీ, ఎస్టీ వేదిక సత్యసాయి జిల్లా అధ్యక్షుడు మద్దెలచెరువు ప్రకాష్, ఎమ్మార్పీఎస్ పుల్లప్ప, ములుగునూరు రామాంజనేయులు, అనిల్, మల్లేశు, నగేష్, ఆనంద్ తదితర విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శిథిల స్థితిలో ఉన్న భవనంపై 60 అడుగుల సెల్ టవర్

## గ్రీన్ కాలనీల్లో రేడియేషన్ ముప్పుపై ఆందోళన



సైనికపురి మహిన్యూస్ ఆగష్టు 24: మహానగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని సైనికపురి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 40 గజాల స్థలంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం, మురుగు కాలువలు, నాళాలు, చెరువులు, కుంటలు, వంకలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని సెల్ టవర్లు, వాణిజ్య ప్రకటనల హోర్డింగులు, ప్లాస్టిక్ బ్యానర్లు, రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేస్తున్న కటౌట్లపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. సైనికపురిలోని సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో సుమారు 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సెల్ టవర్ విషయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 35 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత భవనంపై సుమారు 60 అడుగుల ఎత్తైన సెల్ టవర్‌ను ఏర్పాటు చేయడంతో భవనం భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. టవర్, దాని పరికరాల బరువు పాత భవనంపై అదనపు భారాన్ని మోపుతోందని, భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పలుమార్లు జీహెచ్ఎంసీ కాప్రా కార్యాలయానికి ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ సెల్ టవర్‌కు అవసరమైన అన్ని అనుమతులు లేవు. మొదట ఒకే సర్వీస్ ప్రొవైడర్ కోసం అనుమతి తీసుకుని, అనంతరం మరిన్ని సర్వీస్ ప్రొవైడర్లకు అనుకూలంగా టవర్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు వారు చెబుతున్నారు. మల్టిపుల్ సర్వీస్ ప్రొవైడర్, అంటే ఒకే టవర్‌ను పలువురు టెలికాం సంస్థలు ఉపయోగించే విధానం, అమలు చేసే ముందు సంబంధిత నిబంధనలు, అనుమతులు పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. టవర్‌కు సంబంధించిన రేడియేషన్, అంటే రేడియో తరంగాల రూపంలో వెలువడే విద్యుదయస్కాంత శక్తి, విషయంలోనూ స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సెల్ టవర్ల నుంచి వెలువడే రేడియో తరంగాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్న భయాలు ప్రజల్లో ఉన్నాయని వారు తెలిపారు. అయితే ఇటువంటి ఆరోగ్య ప్రభావాలకు సంబంధించి శాస్త్రీయంగా నిర్ధారిత ఆధారాల ఆధారంగానే అధికారులు, నిపుణులు నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. పాత, బలహీనమైన భవనాలపై భారీ సెల్ టవర్లు ఏర్పాటు చేయడం మాత్రం ప్రజల భద్రతకు సంబంధించిన అంశమని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. భవనం నిర్మాణపరమైన భద్రత, అంటే అదనపు బరువును భరించే సామర్థ్యం, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో అధికారులు తక్షణమే పరిశీలించాలని కోరుతున్నారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన టవర్లపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే వాటిని తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి నివారించడం ప్రభుత్వ, మున్సిపల్ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. సైనికపురి వంటి పచ్చని నివాస ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత భవనాలపై ఏర్పాటు చేసిన భారీ సెల్ టవర్లను సాంకేతికంగా పరిశీలించాలని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ గౌరవ అధ్యక్షుడు శ్రీ నాగేశ్వరరావు, అధ్యక్షుడు డా. ఎం. సురేష్ బాబు, కాలనీ వాసులు మనోహరరావు, డా. ఆశాదేవి, నిషా రాథోడ్, డా. అఖిల మిత్ర, సృజన, డా. సంఘమిత్ర తదితరులు అధికారులను కోరారు. "ప్రమాదం జరిగిన తర్వాత బాధ్యత ఎవరిది అనే ప్రశ్న కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ముఖ్యం. పాత భవనాలపై ఉన్న భారీ సెల్ టవర్ల భద్రతపై అధికారులు తక్షణమే సమగ్ర తనిఖీ నిర్వహించాలి" అని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

## కడపలో సోలార్ పీవీ ఇన్‌స్టలేషన్ శిక్షణ..

## ఇతర జిల్లాల్లో వివిధ రంగాల్లో శిక్షణ

కడప జిల్లా మహి న్యూస్, ఆగస్టు 24: ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కడప, అన్నమయ్య జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

### కడపలో సోలార్ పీవీ ఇన్‌స్టలేషన్ శిక్షణ

వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు కడపలో సోలార్ పీవీ ఇన్‌స్టలేషన్ విభాగంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. ఇందుకు 12వ తరగతి, ఐటీఐ లేదా డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులు.

### వివిధ జిల్లాల్లో ఇతర శిక్షణలు

1. శ్రీకాకుళం - అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ - 10వ తరగతి / ఐటీఐ
2. విశాఖపట్నం - సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ - 12వ తరగతి
3. కాకినాడ - ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ సాంకేతిక నిపుణుడు -- 12వ తరగతి
4. నెల్లూరు - అసిస్టెంట్ టెక్నీషియన్ (కంప్యూటర్, పెరిఫెరల్స్) - 10వ తరగతి
5. విజయవాడ - సర్వీస్ టెక్నీషియన్ / గృహోపకరణాల మల్టీ స్కిల్ టెక్నీషియన్ - 10వ తరగతి
6. ఒంగోలు - మొబైల్ ఫోన్ హార్డ్‌వేర్ రిపేర్ టెక్నీషియన్ - 10వ తరగతి
7. అనంతపురం - కిసాన్ డ్రోన్ ఆపరేటర్ - 12వ తరగతి
8. కడప - సోలార్ పీవీ ఇన్‌స్టలేషన్ - 12వ తరగతి / ఐటీఐ / డిప్లొమా

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

అర్హత కలిగిన ఆసక్తి గల ఎస్సీ యువతీ యువకులు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంఘం వెబ్‌సైట్ ఖజూంఎ౹ఎశీతీ-జూశీతీఝ౹అశీఅ.ఖజూ.గ్రశీఙ.అఅ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఎంచుకుని, తమ పూర్తి వివరాలను నమోదు చేసి, సంబంధిత కోర్సును ఎంపిక చేసుకున్న అనంతరం దరఖాస్తును చివరిగా సమర్పించాలి. దరఖాస్తు పూర్తయిన తర్వాత వివరాలు ఎస్సీ కార్పొరేషన్‌కు చేరుతాయి. అనంతరం శిక్షణకు సంబంధించిన వివరాలు, శిక్షణ తేదీలను ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది అర్హులైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా తెలియజేస్తారు. ఉచిత నైపుణ్య శిక్షణ అవకాశాన్ని అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకుని శిక్షణ పొంది భవిష్యత్తులో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పొందాలని అధికారులు కోరారు.

**మరిన్ని వివరాలకు:**

9440957271, 7075832439

# పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలో, నాణ్యతతో పరిష్కరించాలి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, మహి న్యూస్ ఆగస్టు 24 : ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారం నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో సంతృప్తి స్థాయి పెంపొందించేలా ఉండాలని జిల్లా కలెక్టర్



డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, వీటి పరిష్కారానికి తక్షణమే చర్యలు



తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంలో పెండెన్సీ పై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అలా పరిష్కరించి నప్పుడే ప్రజల్లో అర్జీల పరిష్కారం పట్ల నమ్మకం కలుగుతుందన్నారు. జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీ తిరిగి ఓపెన్ కాకుండా సంబంధిత అధికారి ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. సంబంధిత అధికారి, ఫిర్యాదు దారులకు సరైన విధంగా స్పష్టంగా సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ కలెక్టర్లు రంగస్వామి, జాన్ ఇర్విన్, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, డ్వామా పిడి ఆదిశేషా రెడ్డి, జిల్లా స్థాయి అధికారులు తదతరులు పాల్గొన్నారు.

# గ్రామస్థులకు న్యాయ సేవలు, కమ్యూనిటీ మీడియేషన్‌పై అవగాహన

## చిలంకూరులో న్యాయ అవగాహన కార్యక్రమం

కడప జిల్లా, మహి న్యూస్ ఆగస్టు24: ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామంలో సామాజిక మధ్యవర్తిత్వం, నల్సా న్యాయ సేవల పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్ సూచనలతో ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు న్యాయ సేవలు, ఉచిత న్యాయ సహాయం, వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవల కమిటీల ద్వారా



అందుతున్న న్యాయ సేవలు, అర్హులైన పేదలు, బలహీన వర్గాలు ఉచిత న్యాయ సహాయం పొందే విధానం, ఎక్కడ సంప్రదించాలి, అర్హతలు ఏమిటి అనే అంశాలను ప్రజలకు వివరించారు. గ్రామస్థాయిలో చిన్నచిన్న వివాదాలను పరస్పర అంగీకారంతో,




సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడంలో సామాజిక మధ్యవర్తిత్వం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కోర్టు కేసుల వల్ల సమయం, డబ్బు వృథా కాకుండా వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకునేందుకు కమ్యూనిటీ మీడియేషన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే నల్సా ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ న్యాయ సేవల పథకాలు, ఉచిత న్యాయ సేవలు, జాతీయ లోక్ అదాలత్, శాశ్వత లోక్ అదాలత్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వ్యవస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "న్యాయం ప్రతి ఒక్కరి హక్కు -- న్యాయ సేవలు ప్రతి గ్రామానికి" అనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు, న్యాయ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయ సహాయం అవసరమైన వారు 15100 న్యాయ సేవల సహాయవాణికి ఫోన్ చేయవచ్చని, సమస్యలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన మధ్యవర్తి న్యాయవాదులు సుబ్రహ్మణ్యం, వేణుగోపాల్, గురువయ్య, కమలాపురం బార్ సెక్రటరీ కొండా రెడ్డి, న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, కమలాపురం మండల న్యాయ సేవల కమిటీ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# టీజీ కమ్యూనిటీ సభ్యుల పట్ల వివక్షకు తావులేదు..!

## సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప, మహి న్యూస్ ఆగస్టు 24: టీజీ కమ్యూనిటీ సభ్యుల పట్ల ఎలాంటి చిన్నచూపు, వివక్ష, అసమానత, అభద్రతా భావం ఉండకూడదని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం కడపలోని నిర్మల హాస్పిటల్‌లో టీజీ కమ్యూనిటీ సభ్యుల కోసం మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో, జె.ఎం.జె. సంస్థ పలమనేరు, నిర్మల హాస్పిటల్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి హెచ్ఐవీ, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి, రక్తపోటు, రక్తంలో చక్కెర, ఆర్‌పీఆర్, ఆర్ఎఫ్‌టీ, ఎల్ఎఫ్‌టీ తదితర పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ టీజీ కమ్యూనిటీ సభ్యుల పట్ల వివక్ష, చిన్నచూపు ఉండకూడదన్నారు. వారికి ఎదురయ్యే




న్యాయ, సామాజిక సమస్యల పరిష్కారానికి చట్టపరమైన రక్షణలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వారికి ఎదురయ్యే న్యాయ, సామాజిక సమస్యల పరిష్కారానికి హెచ్ఐవీ/ఎయిడ్స్ (నివారణ మరియు నియంత్రణ) చట్టం, 2017 అండగా ఉంటుందని తెలిపారు. క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని మహాభాగ్యంగా భావించి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టీజీ కమ్యూనిటీ సభ్యులు మంచి పోషకాహారం తీసుకోవడంతో పాటు తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలు, చికిత్సలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ హుస్సేన్, జిల్లా పర్యవేక్షకుడు పి.వి. ప్రసాద్, జిల్లా పర్యవేక్షకుడు పి.వి. ప్రసాద్, రచన దేశ్‌వాలి, సూర్య యాదవ్, రెడ్డమ్మ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560 Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com